PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd
Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna
హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 165 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- గురువారం 11 జూన్ 2026


### కూరాకుల గోపీకి టీడబ్ల్యూజేఎఫ్ భావోద్వేగ నివాళి




### లంబాడితండా గ్రామపంచాయతీలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం







## పుష్కర కాలంలో అనేక మార్పులు

# తీసుకుని వచ్చాం



- మాటలతో కాకుండా చేతలతో అభివృద్ధి చేసి చూపాం
- 12 ఏళ్లుగా కాంగ్రెస్ పాపాలను కడుక్కుంటూ వస్తున్నాం
- కాంగ్రెస్ పాలనలో వ్యవస్థల ధ్వంసం...వేలకోట్ల కుంభకోణాలు
- 2014కు ముందు..ఇప్పుడు దేశ పరిస్థితిని ప్రజలు గమనించాలి
- 'వికసిత్ భారత్ 2047' దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాం
- 12 ఏళ్లు ప్రధానిగా పనిచేసే అవకాశం ఇచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు
- ఎన్‌డిఏ భాగస్వామ్య పక్షాల భేటీలో ప్రధాని మోడీ ప్రసంగం

**న్యూఢిల్లీ,జూన్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ హయాంలో దేశంలో అనేక సమస్యలు ఉండేవని.. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక మార్పులు తెచ్చామని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక దేశ ప్రజల్లో నమ్మకం పెరిగిందన్న ఆయన.. దేశాభివృద్ధికి స్థిరమైన ప్రభుత్వం ఉండాలని ప్రజలు కోరుకున్నారని చెప్పారు. ప్రధానిగా 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఢిల్లీలో జరిగిన ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సదస్సుకు ప్రధాని మోదీ హాజరై ప్రసంగించారు. ఎక్కువ కాలం ప్రధానిగా ఉండే అవకాశం ఇచ్చిన దేశప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్డీయేలో ఉన్న అన్ని పార్టీలకు ఈ విజయం దక్కుతుందన్న ఆయన.. దేశ రాజకీయాల్లో నేడు చారిత్రకమైన రోజుగా అభివర్ణించారు.

మిగతా2లో...

## ఫ్యూచర్ సిటీని రద్దుచేస్తామంటే

# బండకేసి కొడతారు

### - టోక్యో, సింగపూర్‌తో పోటీపడేలా ఫ్యూచర్ సిటీ

- ప్రపంచానికి దిక్సూచిగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం
- అభివృద్ధిని అడ్డుకోవడమే బిజెపి, బిఆర్ఎస్ పని
- కడుపులో విషం పెట్టుకుని కుట్రలు చేస్తున్నారు
- నాలాల కబ్జాలతో హైదరాబాద్ మునిగి పోతోంది
- కబ్జాదారుల కోరలు పీకేందుకే హైడ్రా ఏర్పాటు
- బతుకమ్మకుంటను ఎడ్లకు రాసిచ్చిన కెసిఆర్
- ఫ్యూచర్ సిటీ అభివృద్ధి సంస్థను ప్రారంభించిన సిఎం రేవంత్




**హైదరాబాద్,జూన్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని కొందరు మాట్లాడుతున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తు నగరాన్ని రద్దు చేస్తామంటే బండకేసి కొడతారని హెచ్చరించారు. బుధవారం భారత్ ఫ్యూచర్ సిటీలో.. ఫ్యూచర్ సిటీ అభివృద్ధి సంస్థ భవనాన్ని ప్రారంభించారు. అలాగే లోగో, వెబ్‌సైట్‌ను సీఎం ఆవిష్కరించారు. అలాంటి వారికి రాజకీయంగా భవిష్యత్ ఉండదని విమర్శించారు. ఔటర్ రింగ్ రోడ్‌ను బీజేపీ, బీఆర్ఎస్ నేతలు అడ్డుకున్నారని

మిగతా2లో...

## మెట్రో స్టేషన్ల కింద లీజుకు ఎలా ఇస్తారు

### - పాదచారులకు ఇబ్బంది కలిగించడంపై హైకోర్టు ఆగ్రహం




# జనసేన పుట్టిందే తెలంగాణ గడ్డమీద

- అక్కడికి రావద్దంటే..మీ జాగీరా అనడంలో తప్పేముంది
- ఉత్తర,దక్షిణది విభేదాలు దేశానికి ప్రమాదకరం
- మీడియాతో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్



**న్యూఢిల్లీ,జూన్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** జనసేన పార్టీ పెట్టిందే తెలంగాణలో అని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. తెలంగాణలో తమ పార్టీకి లీడర్స్ ఉన్నారని.. కేడర్ ఉందని పేర్కొన్నారు. బుధవారం ఢిల్లీ వేదికగా నేషనల్ మీడియాతో పవన్ కల్యాణ్ మాట్లాడారు. తెలంగాణలో లక్షన్నర మంది సభ్యత్వం

మిగతా2లో...

## ఘనా పారిశ్రామికాభివృద్ధికి 'తెలంగాణ' మార్గనిర్దేశం

- 'ఫార్మా హబ్' ఏర్పాటుకు పూర్తిస్థాయి సహకారం
- ఘనా ఉన్నత స్థాయి బృందంతో మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్,జూన్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** రిపబ్లిక్ ఆఫ్ ఘనా పారిశ్రామికాభివృద్ధికి మార్గనిర్దేశం చేసేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. అక్కడ ఏర్పాటు చేయనున్న 'ఫార్మా హబ్'కు రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా అండగా ఉంటామని

మిగతా2లో...

## 2027 వేసవి నాటికి మెడిగడ్డ బ్యారేజ్ పునరుద్ధరణ పూర్తి

- జూలై తొలి వారానికి అన్ని సాంకేతిక, హైడ్రాలజికల్ అధ్యయనాల పూర్తి
- సెప్టెంబర్ నాటికి పునరుద్ధరణ డిజైన్ల సిద్ధం
- నవంబర్-డిసెంబర్‌లో పునరుద్ధరణ పనుల ప్రారంభం
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**మేడిగడ్డ,జూన్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** మెడిగడ్డ బ్యారేజ్‌తో పాటు కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీల పునరుద్ధరణ పనులను అత్యంత శాస్త్రీయ పద్ధతిలో చేపట్టి 2027 వేసవి నాటికి పూర్తిచేసి తిరిగి వినియోగంలోకి తీసుకువస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. మెడిగడ్డ బ్యారేజ్ వద్ద జరుగుతున్న సాంకేతిక పరిశోధనలు, హైడ్రాలజికల్ అధ్యయనాలు, జియోటెక్నికల్ పరీక్షలు, గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ సర్వేలు మరియు

మిగతా2లో...



## పీసా చట్టం ఆదివాసీల స్వాభిమానానికి ప్రతీక

- గిరిజన హక్కుల పరిరక్షణకు చట్టం కీలకం
- పీసా చట్టంపై వర్క్‌షాపు ప్రారంభించిన మంత్రి సీతక్క

**హైదరాబాద్,జూన్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** పీసా చట్టం ఆదివాసీల స్వాభిమానానికి ప్రతీక అని మంత్రి సీతక్క అన్నారు. గ్రామసభలను బలోపేతం చేసి గిరిజన హక్కులను

మిగతా2లో...

## ప్రధాని మోడీ సరికొత్త రికార్డు

- అత్యధిక కాలం ప్రధానిగా నెహ్రూ రికార్డు బ్రేక్
- మీనాక్షి వ్యవహారం ఎన్నికల సంఘం పరిధిలోనిదన్న బండి



**కరీంనగర్,జూన్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** భారత రాజకీయాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సరికొత్త చరిత్ర సృష్టించారని, దేశంలో అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగిన జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును బద్దలు కొట్టారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కువ కాలం ప్రధానిగా కొనసాగిన జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును నరేంద్ర మోదీ బ్రేక్ చేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం

మిగతా2లో...

## ప్రధానిగా 12 ఏళ్ల పదవీకాలం పూర్తి

### - మోడీకి అభినందనలు తెలిపిన రాష్ట్రపతి ముర్ము



# పుష్కర కాలంలో అనేక మార్పులు తీసుకుని వచ్చాం

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ పాలనలో అన్ని వ్యవస్థలు ధ్వంసమయ్యాయి. రూ.వేల కోట్ల కుంభకోణాలు జరిగాయి. అభివృద్ధి రేటు దారుణంగా ఉండేది. మేం వచ్చాక రోడ్లు, రైల్వేలు, విమానాశ్రయాల అభివృద్ధిపై దృష్టి పెట్టాం. ఇంటర్నెట్ వాడేవాళ్ల సంఖ్య 25 కోట్ల నుంచి వంద కోట్లకు పెంచాం. భారత్ 2014కు ముందు.. ఇప్పుడెలా ఉందో గమనించాలి. ఎన్డీయే ప్రభుత్వం వచ్చిన తర్వాత పెను మార్పులను ప్రజలు బేరీజు వేసుకోవాలి. కేవలం 12 ఏళ్లలోనే ఇన్ని మార్పులు తీసుకొచ్చాం. మా పథకాలు, కార్యక్రమాలను ప్రజలు కూడా ఆమోదించారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. గతంలో 370 ఆర్టికల్ అంటేనే భయపడేవారు.. మేం రద్దు చేశాం. గతంలో ఉగ్రవాదం పేరు చెబితే భయపడేవారు. మేం వచ్చాక దాడులు చేశాం. దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాం. 'వికసిత్ భారత్ 2047' దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాం. దేశంలో వస్తోన్న పెనుమార్పులను ప్రపంచం ఆసక్తిగా గమనిస్తోంది. పలు దేశాలు సమస్యల పరిష్కారం కోసం మన వైపు చూస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ తన వైఫల్యాలను హిందువులపై నెట్టిందని ధ్వజమెత్తారు. రూ.వేల కోట్ల కుంభకోణాలకు కాంగ్రెస్ పాల్పడిందని ఆగ్రహించారు. కాంగ్రెస్ పాలనలో వృద్ధిరేటు దారుణంగా ఉందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వ్యవస్థలు కుప్పకూలాయని మండిపడ్డారు. కాంగ్రెస్ ఇనుప సంకెళ్ల నుంచి దేశాన్ని రక్షించామని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. అవినీతి రహితంగా ఎన్డీఏ పాలన సాగుతోందని స్పష్టం చేశారు. ప్రధానిగా సుదీర్ఘకాలం పనిచేసే అవకాశం దక్కడం తన అదృష్టమని తెలిపారు. ఇది తనకు అద్భుతమైన క్షణమని వ్యాఖ్యానించారు. తన జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశానని ప్రస్తావించారు. దేశ ప్రజలే తనకు దేవుళ్లు అని ఉద్ఘాటించారు. ఎన్డీఏలో ప్రతి పార్టీకి సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు. తనను అభినందిస్తూ ఎన్డీఏ నేతలు తీర్మానం చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్డీఏ నేతలకు ధన్యవాదాలు తెలిపారు. అధికారాన్ని సేవగానే భావించానని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. తమ హయాంలో స్థిరమైన పాలనతో అభివృద్ధి వేగవంతం అయిందని వెల్లడించారు. 2014కి ముందు దేశంలో ఎంతో అస్థిరత ఉందని తెలిపారు. 2014 తర్వాత దేశ రూపురేఖల్లో అనేక మార్పులు తీసుకువచ్చామని ప్రస్తావించారు. ఎన్డీఏపై దేశ ప్రజల్లో నమ్మకం పెరిగిందని అన్నారు. 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తున్నామని ఉద్ఘాటించారు. అన్నివర్గాల ప్రజల ఆశలకు అనుగుణంగా నడుస్తున్నామని పేర్కొన్నారు. గతంలో దశాబ్దాలపాటు జరిగే అభివృద్ధి.. ఇప్పుడు కేవలం నెలల వ్యవధిలోనే జరుగుతోందని వివరించారు.తమ పథకాలు, కార్యక్రమాలను ప్రజలు ఆదరించారని ప్రధాని మోదీ తెలిపారు. వికసిత్ భారత్‌లో అందరూ భాగస్వాముల య్యారని వెల్లడించారు. దేశంలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశామని చెప్పారు. కరోనా లాంటి సంక్షోభాన్ని అధిగమించామని ఉద్ఘాటించారు. స్థిరమైన ప్రభుత్వం ఉంటేనే అభివృద్ధి సాధ్యమని వ్యాఖ్యానించారు. తాము లెక్కలు మాత్రమే చెప్పడం లేదని.. ఆచరణలో చేసి చూపించామని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తమ పాలసీలు ఉంటాయని వివరించారు. ప్రపంచ దేశాలు ఆర్థిక సంక్షోభంలో ఉన్నా.. భారత్‌లో 7.7శాతం వృద్ధి రేటు ఉందని పేర్కొన్నారు.సామాన్యులపై భారం తగ్గించేందుకు కృషి చేస్తున్నామని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ వృద్ధిరేటు కంటే ఎన్డీఏ హయాంలోని 12 ఏళ్లలో వృద్ధిరేటు తెలిపోయిందని అన్నారు. దేశంలో మావోలను అంతం చేశామని తెలిపారు. నేషన్ ఫస్ట్ నినాదంతో పనిచేస్తున్నామని వివరించారు. దేశ భవిష్యత్తు కోసం కఠిన నిర్ణయాలకూ కూడా వెనుకాడమని చెప్పారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించామని తెలిపారు. ట్రిపుల్ తలాక్ చట్టం తీసుకువచ్చామని ప్రస్తావించారు. ఆర్టికల్ నంబర్- 370ని రద్దు చేశామని అన్నారు. కశ్మీర్‌లో ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపామని చెప్పుకొచ్చారు. తనకు పార్టీ కంటే.. దేశ ప్రజలే ముఖ్యమని స్పష్టం చేశారు. తమది లెక్కల ప్రభుత్వం కాదని.. ఆచరణాత్మక ప్రభుత్వమని ఉద్ఘాటించారు. దేశంలో డిజిటల్ పేమెంట్లను ప్రోత్సహించామని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. ప్రపంచమంతా ఇప్పుడు భారత్‌వైపు చూస్తోందని తెలిపారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా.. భారత్ మారడానికి మరింత వేగంగా పనిచేయాల్సిన అవసరం ఉందని వివరించారు. విదేశాలపై ఆధారపడటం తగ్గించుకోవాలని సూచించారు. మేడ్ ఇన్ ఇండియా నినాదం సాకారమవుతోందని అన్నారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో నౌకలు తయారు చేస్తున్నామని తెలిపారు. అణుఇంధన ఉత్పత్తిపై దృష్టి పెట్టాలని సూచించారు. డేటా సెంటర్ల హబ్‌గా భారత్ మారుతోందని వ్యాఖ్యానించారు.

# జనసేన పుట్టిందే తెలంగాణ గడ్డమీద

(మొదటి పేజీ తరువాయి)

జనసేనకు ఉందని ప్రస్తావించారు. వాళ్లు ఉత్సాహంగా ఉన్నప్పుడు.. వారి కోసం పనిచేయొద్దా? అని ప్రశ్నించారు. కర్ణాటక, తమిళనాడులో ఉన్నవారి కోసం ఏమైనా చేయాలి కదా అని చెప్పుకొచ్చారు. తెలంగాణ రాష్ట్ర విభజనకు కాదని.. విభజన జరిగిన తీరుకు తాను వ్యతిరేకమని స్పష్టం చేశారు. తెలంగాణలోకి తనను రావొద్దనడం తన ప్రాథమిక హక్కుకి భంగం కలిగించినట్లేనని పేర్కొన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ ఏనాడూ ఇలా మాట్లాడలేదని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే ప్రాంతీయ విద్వేషాలు మొదలయ్యాయని విమర్శించారు. '13 నెలలుగా నన్ను పర్సనల్‌గా టార్గెట్ చేస్తే.. తెలంగాణ మీ అయ్య జాగీరా అని అనడం తప్పా?' అని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. ఇకపోతే ఉత్తరాది, దక్షిణాది అనే భావన సరికాదని, అలా విభజన రేఖ గీయకూడదని పవన్ కల్యాణ్ అన్నారు. ఈ భావన పెరిగితే దేశానికి ప్రమాదకరమని చెప్పారు. సమస్యలుంటే ఎక్కడైనా వాటిపై మాట్లాడొచ్చన్నారు. సీఎం హోదాలో ఉన్నవారు ఉత్తర, దక్షిణ ప్రాంతాలంటూ మాట్లాడకూడదని హితవు పలికారు. విభజనవాదం దేశానికి మంచిది కాదు. 570కి పైగా సంస్థానాలను కష్టపడి విలీనం చేస్తే దేశం ఇలా ఉంది. నేను హైదరాబాద్ రాకూడదని కొందరు నేతలు అన్నారు. అలా అయితే, రాహుల్ గాంధీకి దక్షిణాదితో సంబంధం లేదని చెప్పాల్సి ఉంటుంది. రాజకీయాలు మారాలని, ప్రాంతీయ వివక్ష, విధ్వంసకర ధోరణి ఉండకూడదని యువత కోరుకుంటోంది. చెప్పే మాటల్లో అర్థం, హేతుబద్ధత ఉండే నాయకులే యువతకు కావాలి. తమ సమస్యలు తెలుసుకొని, పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. తెలంగాణ అభివృద్ధి కావాలని కోరుకుంటున్నా. అక్కడ పోటీ చేయాలని మా పార్టీ నేతలు కోరారు. నేనెప్పుడు, ఎక్కడికి వెళ్లాలో ఇతర వ్యక్తులు చెప్పలేరు. ఈ దేశం నాది.. ఎక్కడికైనా వెళ్లవచ్చనే ఉద్దేశంతోనే జాగీర్ అనే పదం వాడా. రాష్ట్ర విభజనకు నేనెప్పుడూ వ్యతిరేకం కాదు.. చేసిన తీరునే వ్యతిరేకించా'అని పవన్ తెలిపారు.వీబీ-జీ రామ్ జీ పథకం కింద ఏపీకి కేంద్రం రూ.7,707.21 కోట్లు కేటాయించడంపై పవన్ కల్యాణ్ సంతోషం వ్యక్తం చేశారు. దేశంలోనే మూడో అత్యధిక కేటాయింపును ఏపీ దక్కించుకుంద న్నారు. ఉపాధి పనుల్లో పారదర్శకతతో పాటు సమర్థ వంతమైన నిర్వహణకు ఇది నిదర్శనంగా అభివర్ణిం చారు. కేంద్రం ఇస్తున్న నిధులు గ్రామాల్లో మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తాయని, ప్రజల జీవనో పాధిని మెరుగుపరుస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

# ఫ్యూచర్ సిటీని రద్దుచేస్తామంటే బండకేసి కొడతారు

(మొదటి పేజీ తరువాయి)

ధ్వజమెత్తారు. అభివృద్ధి జరగొద్దని కుట్రలు చేస్తున్నారని ఆగ్రహించారు. ఇప్పుడు ఫ్యూచర్ సిటీని అడ్డుకునేందుకు యత్నిస్తున్నారని దుయ్యబట్టారు. శుక్రాచార్యుడు ఫామ్‌హౌస్‌లో ఉన్నారని ఎద్దేవా చేశారు. మారీచుడు, సుభాహు జనంలోకి వచ్చారని సెటైర్లు గుప్పించారు. వీళ్లంతా కలిసి తెలంగాణ అభివృద్ధికి అడ్డుపడుతున్నారని ఫైర్ అయ్యారు. కడుపునిండా విషం నింపుకొని కుట్రలు చేస్తున్నారని ఆగ్రహించారు. ఏడ్చేవాళ్లు ఏడవండి.. తాము అభివృద్ధి చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. నిన్న 2 గంటల వర్షానికే హైదరాబాద్ వరదమయమైందని చెప్పుకొచ్చా రు. ఇదేనా మీ పదేళ్ల అభివృద్ధి? అని ప్రశ్నించారు. చెరువులు, నాలాలు కబ్జా చేస్తే సహించేది లేదని హెచ్చ రించారు. బతుకమ్మ కుంట ఏమైనా ఎడ్ల సుధాకర్ తాత ఆస్తినా అని ప్రశ్నించారు. అంబర్‌పేటలో ఉన్న బతుకమ్మకుంటను ఎడ్ల సుధాకర్‌కు కేసీఆర్ రాసిచ్చారు. ఆనాటి నాయకులు ప్రభుత్వ భూముల్ని ఆక్రమించారు. అందుకే, హైడ్రాతో అక్రమ కట్టడాలను తొలగిస్తున్నాం. చెరువులను పునరుద్ధరిస్తున్నాం. లేక్ ఎకానమీ సృష్టించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. గ్లోబల్ సమ్మిట్ ద్వారా ప్రపంచదేశాలను ఇక్కడికి రప్పించాం. డిసెంబర్‌లోనూ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తాం' అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కబ్జాకోరులు బాధపడినా పర్వాలేదు.. తమ ప్రయత్నం ఆగదని తేల్చిచెప్పారు. కబ్జాకోరుల కోరలు పీకుతాం.. తోకలు కత్తిరిస్తామని హెచ్చరించారు. తెలంగాణకు 60 శాతం ఆదాయం హైదరాబాద్ నుంచే వస్తోందని వ్యాఖ్యానించారు. ప్రపంచానికి దిక్సూచిగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం నిలుస్తుందని పేర్కొన్నారు. టోక్యో, సింగపూర్‌తో ఫ్యూచర్ సిటీ పోటీ పడుతుందని చెప్పుకొచ్చారు. ప్రపంచంలోనే గొప్ప నగరంగా ఫ్యూచర్ సిటీ అని ఉద్ఘాటించారు. ప్రపంచ దేశాలను ఫ్యూచర్ సిటీకి తీసుకొస్తున్నామని వివరించారు. ఫ్యూచర్ సిటీలో పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీ కేవలం మన కోసం మాత్రమే కాదు.. మొత్తం ప్రపంచానికని అన్నారు. 150 రోజుల్లోనే ఈ కార్యాలయ నిర్మాణం పూర్తి చేశామన్నారు. వచ్చే ఎనిమిదేళ్లలో న్యూయార్క్, టోక్యో, సింగపూర్‌తో పోటీపడేలా ఫ్యూచర్ సిటీని రూపొందిస్తామని చెప్పారు. 2034 నాటికి ట్రిలియన్ డాలర్ ఎకానమీకి ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కావాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ నగరాన్ని విస్తరించడం వల్లే ప్రపంచపటంలో ప్రత్యేక స్థానం లభించింది. బంగారం ధర కంటే రంగారెడ్డి భూముల ధరలే ఎక్కువ. ఆనాటి నిజాంలు, కులీకుతుబ్ షా హైదరా బాద్ నగరాన్ని అనేకసార్లు విస్తరించారు. హైటెక్‌సిటీ, ఓఆర్ఆర్, జీనోమ్ వ్యాలీని అడ్డుకోవాలని చాలా మంది కుట్రలు చేశారు. నగరాన్ని విస్తరించకపోతే 10లక్షల మంది ఐటీ నిపుణులు రాణించేవారా అని అన్నారు. ఫ్యూచర్ సిటీని అడ్డుకునేందుకు బీఆర్ఎస్ నాయకులు కుట్రలు పన్నుతున్నారు. బీఆర్ఎస్ రద్దయిన నోటు. ఆ పార్టీని ప్రజలు తిరస్కరించారు. ఇలాగే ప్రవర్తిస్తే వచ్చేసారి ప్రతిపక్ష హోదా కూడా రాదని హెచ్చరించారు.

# 2027 వేసవి నాటికి మెడిగడ్డ బ్యారేజ్ పునరుద్ధరణ పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

పునరుద్ధరణ ప్రణాళికల పురోగతిని బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జూలై తొలి వారానికి అన్ని సాంకేతిక, హైడ్రాలజికల్ అధ్యయనాలు పూర్తవుతాయని, అనంతరం సేకరించిన నివేదికలను కేంద్ర జల సంఘం, జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థలకు పంపుతామని తెలిపారు. వాటి సూచనల మేరకు 2026 సెప్టెంబర్ నాటికి పునరుద్ధరణ డిజైన్లను ఖరారు చేస్తామని చెప్పారు. వర్షాకాలం ముగిసిన వెంటనే నవంబర్ చివరి వారంలో లేదా డిసెంబర్ తొలి వారంలో పునరుద్ధరణ పనులు ప్రారంభిస్తామని, ఒకే పని సీజన్‌లో పనులు పూర్తి చేసి 2027 వేసవి నాటికి బ్యారేజీలను తిరిగి అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి స్పష్టం చేశారు. హైడ్రాలజికల్ అధ్యయనాలతో పాటు జియోటెక్నికల్ బోర్‌హోల్ పరిశోధనలు, ఇతర సాంకేతిక పరీక్షలను వేగవంతం చేశామని తెలిపారు. ప్రస్తుతం మూడు బ్యారేజీల్లో ఉఖభీ పరీక్షలు 90 శాతం వరకు పూర్తయ్యాయని, బోర్‌హోల్ మరియు జియోటెక్నికల్ పరిశోధనలు 80 శాతం వరకు పూర్తయ్యాయని చెప్పారు. జూన్ చివరి నాటికి అన్ని పరీక్షలు, పరిశోధనలు పూర్తవుతాయని వెల్లడించారు. భవిష్యత్తులో ఈ తరహా నష్టం పునరావృతం కాకుండా ఉండేందుకు 40 నుంచి 80 మీటర్ల లోతు వరకు బోర్‌హోల్స్ తవ్వి భూగర్భ పరిస్థితులపై సమగ్ర సమాచారం సేకరిస్తున్నామని చెప్పారు. కేంద్ర జల సంఘం, జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థల ఆమోదం వచ్చిన తర్వాతే పునరుద్ధరణ పనులు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పాలకుల తప్పుడు నిర్ణయాలు, లోపభూయిష్ట విధానాలు, నిర్మాణ లోపాల కారణంగానే మెడిగడ్డతో పాటు ఇతర బ్యారేజీలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 2023 అక్టోబర్‌లో జరిగిన నష్టం గత ప్రభుత్వ హయాంలోనే జరిగింది. అనంతరం నిర్వహించిన విచారణల్లో జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ, న్యాయ కమిషన్ పలు నిర్మాణ, డిజైన్, నిర్వహణ లోపాలను గుర్తించాయని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.38,000 కోట్ల అంచనా వ్యయంతో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును ప్రారంభించిందని గుర్తు చేశారు. 2014 నాటికే దాదాపు మూడోవంతు పనులు పూర్తయ్యాయని చెప్పారు. అదే ప్రాజెక్టును కొనసాగించి ఉంటే 2016-17 నాటికే పూర్తయి సుమారు 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని పేర్కొన్నారు.అయితే తెలంగాణ ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం రీ-డిజైన్ పేరుతో ప్రాజెక్టు అంచనాలను భారీగా పెంచిందని విమర్శించారు. రూ.38,000 కోట్లతో ప్రారంభమైన ప్రాజెక్టు వ్యయం ప్రస్తుతం లక్ష కోట్ల రూపాయలు దాటిందని, కాగ్ అంచనాల ప్రకారం అది రూ.1.45 లక్షల కోట్ల వరకు చేరే అవకాశం ఉందని తెలిపారు. ఇంత భారీ ప్రజాధనం ఖర్చు చేసినప్పటికీ 2023 డిసెంబర్ 7 తర్వాత మూడు బ్యారేజీలు వినియోగంలో లేకపోవడం అత్యంత దురదృష్టకరమైన పరిణామంగా ఆయన అభివర్ణించారు.

# ప్రధానిగా 12 ఏళ్ల పదవీకాలం పూర్తి

## - మోడీకి అభినందనలు తెలిపిన రాష్ట్రపతి ముర్ము

**న్యూఢిల్లీ,జూన్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రధానమంత్రిగా మోదీ 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మోదీకి అభినందనలు తెలిపారు. మోదీ నాయకత్వంపై దేశ ప్రజలకు ఉన్న అచంచలమైన నమ్మకానికి ఈ మైలురాయి నిదర్శనమని కొనియాడారు. ఆయన పాలనలో దేశం అన్నిరంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం చేపట్టిన విస్తృతమైన సంక్షేమ కార్యక్రమాలు అట్టడుగు స్థాయి ప్రజలకు కూడా అభివృద్ధి ప్రయోజనాలు సమానంగా అందించేలా చేశాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు పీఎం-జన్మన్, ధర్తీ ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ లకు తన హృదయంలో ప్రత్యేక స్థానం ఉందని ముర్ము వెల్లడించారు. ఆదివాసీల కోసం ఏర్పాటుచేసిన పథకాలు ఇవని తెలిపారు. మోదీ స్ఫూర్తిదాయక ప్రస్థానం భావితరాల్లో భారతదేశపు బలమైన ప్రజాస్వామ్య సంప్రదాయాలపై ఆశను.. నూతన విశ్వాసాన్ని నింపుతుందని రాష్ట్రపతి కొనియాడారు. ఆత్మనిర్భర్, వికసిత్ భారత్ దార్శనికతతో ప్రధాని దేశాన్ని మరింత ముందుకుతీసుకువెళ్తారని విశ్వాసం వ్యక్తంచేశారు.

# ప్రధాని మోడీ సరికొత్త రికార్డు

(మొదటి పేజీ తరువాయి)

భారతదేశంలో అత్యధిక కాలం ప్రధానిగా సేవలందిస్తున్న రికార్డు మోదీ పేరిట లిఖించబడిందని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. 'రాబోయే 2047 సంవత్సరం వరకూ నరేంద్ర మోదీయే దేశ ప్రధానిగా కొనసాగాలి. విప్లవాత్మక నిర్ణయాల వల్ల ప్రపంచ దేశాల ముందు భారతదేశ కీర్తి ప్రతిష్టలు శరవేగంగా పెరుగుతున్నాయి. రాబోయే రోజుల్లో ప్రపంచంలోనే భారత్‌ను 'విశ్వగురు' స్థానంలో నిలబెట్టడం ఖాయం' అని అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ వ్యవహారంపై మీడియా అడిగిన ప్రశ్నకు బండి సంజయ్ స్పందించారు. ఆ వివాదం పూర్తిగా ఎన్నికల కమిషన్ పరిధిలోని అంశమని, చట్టప్రకారం ఈసీనే దానిపై తగిన నిర్ణయం తీసుకుంటుందని ఆయన వ్యాఖ్యానించారు.

# మెట్రో స్టేషన్ల కింద లీజుకు ఎలా ఇస్తారు

**హైదరాబాద్,జూన్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** మెట్రోస్టేషన్ల కింద పాదచారుల కోసం కేటాయించిన ఫుట్‌పాత్ ప్రాంతాల్లో స్టాళ్ల ఏర్పాటుపై తెలంగాణ హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. పాదచారులు నడిచే ప్రాంతాలను లీజుకు ఇవ్వడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై న్యాయ స్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ విచారణ సందర్భంగా న్యాయవాది విజయ్ గోపాల్ కోర్టుకు వివరాలు సమర్పించారు. మెట్రోస్టేషన్ల కింద ఏర్పాటు చేసిన స్టాళ్ల విషయంలో ఇప్పటికే జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. అలాగే వీధి వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటున్న జీహెచ్ఎంసీ, మెట్రోస్టేషన్ల కింద ఉన్న వాణిజ్య స్టాళ్ల విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చారు. దీంతో హైకోర్టు ఫుట్‌పాత్ స్థలాన్ని లీజుకు లేదా అద్దెకు ఎలా ఇస్తారని ప్రశ్నించింది. పాదచారుల కోసం ఉద్దేశించిన ప్రాంతాల్లో వాణిజ్య కార్యకలాపాలకు అనుమతి ఇవ్వడం ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగిస్తుందని హైకోర్టు అభిప్రాయపడింది. ఈ అంశంపై సంబంధిత అధికారులు తీసుకున్న చర్యల వివరాలను సమర్పించాలని ఆదేశించింది. ఈ ఫిర్యాదుపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టారో పూర్తి నివేదికను సమర్పించాలని జీహెచ్ఎంసీ, హెచ్ఆర్ఎంఎల్‌లకి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో విచారణను 17వ తేదీకి వాయిదా వేసింది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో మెట్రోస్టేషన్ల కింద ఏర్పాటు చేసిన స్టాళ్ల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది.

# ఘనా పారిశ్రామికాభివృద్ధికి 'తెలంగాణ' మార్గనిర్దేశం

(మొదటి పేజీ తరువాయి)

హామీ ఇచ్చారు. ఆ దేశ ప్రెసిడెన్షియల్ అడ్వైజర్ ఆగస్టస్ ఒబువాడుం టానో నేతృత్వంలోని ఉన్నతస్థాయి బృందం సచివాలయంలో బుధవారం మంత్రి శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసింది. 'తెలంగాణ-ఘనా' మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు, అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ఘనా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 24 అవర్ ఎకానమీ అండ్ యాక్సలరేటెడ్ ఎక్స్ పోర్ట్ డెవలప్ మెంట్ ప్రోగ్రాం, ఫార్మా హబ్ ఏర్పాటు తదితర అంశాలను ఆగస్టస్ ఒబువాడుం టానో వివరించారు. ఘనా పారిశ్రామిక, ఆర్థిక పరివర్తనకు సహకరించాలని మంత్రి శ్రీధర్ బాబును విజ్ఞప్తి చేశారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ఆనతికాలంలోనే పారిశ్రామికరంగంలో తెలంగాణ అద్భుతమైన వృద్ధిని నమోదు చేసిందన్నారు. ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, ఫుడ్ ప్రాసెసింగ్, డిఫెన్స్, అడ్వాన్స్డ్ మ్యానుఫ్యాక్చరింగ్ తదితర రంగాల్లో అంతర్జాతీయ కేంద్రంగా ఎదిగిందన్నారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించేందుకు అమలు చేస్తున్న 'ఈజ్ ఆఫ్ డూయింగ్ పాలసీ'లను ఆయన వివరించారు. ఫార్మాస్యూటికల్ మ్యానుఫ్యాక్చరింగ్, రీసెర్చ్, వ్యాక్సీన్ల తయారీ, గ్లోబల్ సప్లై చైన్ నిర్వహణ, లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణకున్న అంతర్జాతీయ నైపుణ్యాన్ని పంచుకునేందుకు సిద్ధంగా ఉన్నామని ఘనా ప్రతినిధులకు చెప్పారు. ఘనా పారిశ్రామిక, ఆర్థిక పరివర్తనలో తెలంగాణ ఒక నమ్మకైన భాగస్వామిగా ఉంటుందని భరోసానిచ్చారు.

# పీసా చట్టం ఆదివాసీల స్వాభిమానానికి ప్రతీక

(మొదటి పేజీ తరువాయి)

కాపాడాలన్నారు. గిరిజనుల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణకు పీసా చట్టం కీలకమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. బుధవారం రాజేంద్రనగర్‌లో పీసా చట్టం అమలుపై రెండు రోజుల రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను మంత్రి ప్రారంభించి... ప్రసంగించారు. పీసా చట్టంపై అధికారులు, ప్రజాప్రతినిధులకు పూర్తి అవగాహన అవసరమని తెలిపారు. పీసా కేవలం చట్టం కాదని.. ఆదివాసీల స్వయం నిర్ణయాధికారానికి రక్షణ కవచమని వెల్లడించారు. గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని.. గ్రామసభలే ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలని మంత్రి తెలిపారు. సహజ వనరులపై గ్రామసభల నిర్ణయాధికారాన్ని పీసా చట్టం కల్పించిందన్నారు. చట్టం ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో చట్టవిరుద్ధ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని తెలిపారు. స్థానిక ప్రజల అభిప్రాయాలను పక్కనబెట్టి కార్పొరేట్ల చేతుల్లోకి సహజ వనరులు వెళ్లకూడదన్నారు. పీసా చట్ట స్ఫూర్తిని అర్థం చేసుకుని అమలు చేసినప్పుడే ఆదివాసీలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. సర్పంచులు గ్రామాభివృద్ధి నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధి గ్రామసభల బలోపేతంతోనే సాధ్యమని స్పష్టం చేశారు. గిరిజన హక్కుల పరిరక్షణ తనకు ప్రత్యేక బాధ్యతగా చెప్పుకొచ్చారు. ఉన్నవారి కోసం కాదు.. లేని వారి కోసం పనిచేయడమే ప్రజాసేవ అని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఇంకా ప్రాథమిక సదుపాయాల కొరత ఉందని సీతక్క వెల్లడించారు. గుట్టలు కరిగిపోతున్నాయని.. సహజ వనరులు క్షీణిస్తున్నాయన్నారు. గ్రామ పంచాయతీలు, గ్రామసభలను మరింత బలోపేతం చేయాలన్నారు. పీసా అమలులోని సవాళ్లకు వర్క్‌షాప్ చర్చలు పరిష్కార మార్గాలు చూపాలని తెలిపారు. 'సర్పంచ్ సంవాద్' ద్వారా 4,500 మంది సర్పంచులు ఒకే వేదికపైకి వచ్చారన్నారు. సాంకేతికతతో గ్రామీణ పాలనను మరింత సమర్థవంతం చేస్తున్నామని తెలిపారు. పీసా అమలు పుస్తకాలకే పరిమితం కాకూడదని.. గ్రామస్థాయిలో ఫలితాలు కనిపించాలన్నారు. ఆదివాసీల స్వపరిపాలన స్ఫూర్తిని కార్యరూపంలోకి తీసుకురావాలని తెలిపారు.

# బాలికపై అఘాయిత్యానికి నిరసనగా ఖమ్మంలో అఖిలపక్ష భారీ ర్యాలీ

**నిందితుడు గౌస్ పాషాకు కఠిన శిక్ష విధించాలని, బాధిత కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్**




**ఖమ్మం, ప్రతినిధి జూన్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** నగరంలో 12 ఏళ్ల బాలికపై జరిగిన దారుణ ఘటనకు నిరసనగా అఖిలపక్షం ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం భారీ ర్యాలీ నిర్వహించారు. బాలికపై అత్యాచారానికి పాల్పడి హత్యాయత్నానికి కుట్ర చేసిన నిందితుడు గౌస్ పాషాను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది ప్రజలు, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు ర్యాలీలో పాల్గొన్నారు.ఆర్ అండ్ బి అతిథి గృహం నుంచి ప్రారంభమైన ర్యాలీ మయూరి సెంటర్ మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా మయూరి సెంటర్ వద్ద నిరసనకారులు రోడ్డుపై ధర్నాకు దిగుతూ నిందితుడికి ఉరిశిక్ష విధించాలని, బాధిత బాలిక కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం అందించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, జిల్లా అధ్యక్షులు శీలంశెట్టి వీరభద్రం, రాపర్తి శరత్, దాసరి మధు, తోట రమేష్, మాటేటి కిరణ్, ఆకుతోట శేఖర్, పగడాల మోహన్ రావు, ముత్యం కొండల్ రావు, వాసంశెట్టి రామారావు, గొట్టం శ్రీనివాసరావు, నామాల అశోక్, ఆకుల సురేష్, తీగల రాము, పీ.వీ. కుమార్, కమటం అప్పారావు, గడియాల మధు, కానూరు కిరణ్ కుమార్, తోట వెంకటేశ్వర్లు, సుంకరి పుల్లారావు తదితరులు ఆకుపచ్చ కండువాలు ధరించి పాల్గొన్నారు. నిరసనకారులు బాలికకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# కూరాకుల గోపీకి టీడబ్ల్యూజేఎఫ్ భావోద్వేగ నివాళి

**- గోపీ కుటుంబం ఒంటరి కాదు, ఫెడరేషన్ కుటుంబం అండగా ఉంటుంది**

**- తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి బి. రాజశేఖర్**



**ఖమ్మం ప్రతినిధి, జూన్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్–హెచ్–2843) ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి, సీనియర్ జర్నలిస్టు కూరాకుల గోపీ అకాల మరణం జర్నలిస్టు సమాజానికి తీరని లోటని, గోపీ కుటుంబం ఒంటరి కాదని, ఫెడరేషన్ కుటుంబం అండగా ఉంటుందని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి బి. రాజశేఖర్ అన్నారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతూ, సహచర పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేసిన గోపీ సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఖమ్మం జిల్లా, రఘునాథపాలెం మండలం పాపటపల్లిలో బుధవారం నిర్వహించిన గోపీ దశదినకర్మ కార్యక్రమానికి హాజరైన టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దువ్వా సాగర్, టీబీజేఏ జిల్లా అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్, స్టేట్ కౌన్సిల్ సభ్యురాలు నలుబోల మధుశ్రీ, జిల్లా నాయకులు టీఎస్ చక్రవర్తి, కొరకొప్పుల రాంబాబు, కొమిరె నాగేశ్వరరావు, భూక్యా శ్రీనివాస్ తదితరులు గోపీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గోపీ కేవలం ఒక జర్నలిస్టు మాత్రమే కాదని, పాత్రికేయుల సంక్షేమానికి కృషి చేసిన ఉద్యమకారుడని పేర్కొన్నారు. సహచర జర్నలిస్టుల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, వారి హక్కుల సాధన కోసం ఎన్నో పోరాటాల్లో ముందుండి నడిపించిన ఆయన సేవలను ఎవరూ మరచిపోలేరన్నారు. తన సరళ స్వభావం, నిబద్ధత, సేవా తత్పరతతో అందరి మన్ననలు పొందిన గోపీ మరణం ప్రతి పాత్రికేయ హృదయాన్ని కలచివేసిందన్నారు. గోపీ భార్య క్రాంతి, కుమార్తెలు తేజస్విని, యశస్వినిలను పరామర్శించిన నాయకులు, ఈ క్లిష్ట సమయంలో గోపి నేడు మన మధ్య లేకపోయినా ఆయన కుటుంబం ఒంటరిది కాదు.. టీడబ్ల్యూజేఎఫ్ కుటుంబం వారికి పూర్తి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సీనియర్ జర్నలిస్టుగా గోపీకి ప్రభుత్వం ద్వారా లభించాల్సిన అన్ని సంక్షేమ పథకాలు, ఆర్థిక ప్రయోజనాలు, ఇతర ప్రభుత్వ సదుపాయాలు వారి కుటుంబానికి అందేలా జిల్లా కమిటీ పూర్తి స్థాయిలో కృషి చేస్తుందని హామీ ఇచ్చారు.గోపీ సమాజానికి, జర్నలిజం రంగానికి అందించిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని, ఆయన ఆశయాలను కొనసాగించడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని నాయకులు పేర్కొన్నారు. గోపీ జ్ఞాపకాలు పాత్రికేయ లోకంలో ఎప్పటికీ సజీవంగా ఉంటాయని, ఆయన సేవాస్ఫూర్తి భావితరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని వారు అన్నారు.

# మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తున్నాం: చైర్మన్ ధరావత్ మోహన్

**కల్లూరు, జూన్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మున్సిపాలిటీ అభివృద్ధి కొరకు 15 కోట్లు మంజూరయ్యాయని అన్ని వార్డులు సమానంగా అభివృద్ధి చేయలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని చైర్మన్ ధరావత్ మోహన్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 15వ వార్డ్ నందు 99 రోజుల ప్రజా పాలన ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా చైర్మన్ అధ్యక్షతన గ్రామసభ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ గ్రామ సభలో అనేకమంది నిరుపేదలు ఉండడంతో ఇల్ల స్థలాలు లేక అద్దెలకు నివాసం ఉంటున్నామని ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి మిమ్మల్ని ఆదుకోవాలని కోరారు. ఇట్టి విషయాలన్నీ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రెవిన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి తప్పకుండా న్యాయం చేస్తామని చైర్మన్ ధరావత్ మోహన్ అన్నారు. ఈ సందర్భంగా గ్రామ సభలో పాల్గొన్నవారు తమ సమస్యలు పరిష్కారం కొరకై చైర్మన్ కు వినతి పత్రాలు అందజేశారు. ప్రతి విషయాన్ని పరిశీలించి పరిష్కారం దిశగా పనిచేస్తామని వారికి గ్రామ సభలో హామీ ఇచ్చారు. ఏఎంసి చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ మాట్లాడుతూ పేదల కోసం పోరాడే పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని మహిళల కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ఇచ్చి వారిని అభివృద్ధి పరుస్తుందని అన్నారు. మున్సిపల్ ఇంచార్జ్ కమిషనర్ నరసింహ మాట్లాడుతూ ప్రధానంగా చెత్త సమస్య ఉంటుందని మన ఇంట్లో ఉత్పత్తి చెత్తను సేకరించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి పని దశలవారీగా చేయడం జరుగుతుందని వార్డులలో ఎటువంటి పనులు ఉన్న వాటిని గుర్తించి తగిన సమయంలో పనులు పూర్తి చేయడం జరుగుతుందని, అభివృద్ధి నిధుల ద్వారా వార్డులో ప్రతి సమస్యకు పరిష్కారం దొరుకుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్, వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి, కౌన్సిలర్ యాస నాగమణి శ్రీకాంత్, ఉబ్బన్న రాంబాబు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆలకుంట నరసింహారావు, జిల్లా యువజన నాయకుడు ధరావత్ రవికుమార్, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.











# లంబాడితండా గ్రామపంచాయతీలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం

**● 15 లీటర్ల గుడుంబా, ● 180 ఎంఎల్ సామర్థ్యం గల 144 ఓసీ మద్యం సీసాలు, 2 డెక్కన్ వైట్ ఫుల్ బాటిళ్ల మద్యం స్వాధీనం**




**బెల్లంపల్లి ప్రతినిధి, జూన్ 9 (పిసిడబ్ల్యూ న్యూస్):** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలో లంబడి తండా గ్రామపంచాయతీ పరిధిలో ఈ రోజు తెల్లవారు జామున బెల్లంపల్లి రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో లంబాడితండా గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా జాగరి అంకులు అనే వ్యక్తి వద్ద నుంచి 15 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. అజ్మీరా శేఖర్ వద్ద నుంచి 180 ఎంఎల్ సామర్థ్యం గల 144 ఓసీ మద్యం సీసాలు, 2 డెక్కన్ వైట్ ఫుల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. గతంలో కూడా వీరు ఇరుగురు అమ్మకాలు చేస్తు పట్టు పడ్డట్టు పోలీసులు తెలిపారు. అదేవిధంగా 20 మోటార్‌సైకిళ్లు,2 ఆటోలు,2 ట్రాక్టర్ల పత్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి రూరల్ సీఐ హోనుక్ గ్రామస్తులతో మాట్లాడుతూ గుడుంబా తయారీ, విక్రయాలు చట్టవిరుద్ధమని తెలియజేసి వాటికి దూరంగా ఉండాలని సూచించారు.సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తాళ్ల గురిజాల ఎస్ఐ రామకృష్ణ, బెల్లంపల్లి–2 టౌన్ ఎస్ఐ కిరణ్ కుమార్, బెల్లంపల్లి రూరల్ సర్కిల్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# హర్యాతండాలో ఉపాధి హామీ పనులకు శ్రీకారం గ్రామాభివృద్ధే లక్ష్యంగా ప్రజాప్రతినిధుల ముందడుగు



**రఘునాథపాలెం, జూన్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించడంతో పాటు గ్రామ అభివృద్ధిని వేగవంతం చేయాలనే లక్ష్యంతో రఘునాథపాలెం మండలం హర్యాతండా గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) పనులను బుధవారం ఘనంగా ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ బానోత్ స్వాతి, ఉపసర్పంచ్ శ్రీను నాయక్ ఆధ్వర్యంలో పనులకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ, గ్రామీణ కార్మికులకు నిరంతర ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఉపాధి హామీ పనులు కీలకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేస్తామని తెలిపారు.గ్రామాభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్న ప్రజాప్రతినిధుల చొరవతో ప్రారంభమైన ఈ పనులు గ్రామ ప్రజల్లో ఆనందాన్ని నింపాయి. గ్రామ ప్రగతికి నిరంతరం కృషి చేస్తున్న మాజీ సర్పంచ్ కాంతి, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీను, బానోత్ కృష్ణ, 5వ వార్డు సభ్యుడు అజ్మీరా వెంక తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని పనుల విజయవంతానికి సహకరించారు.గ్రామ ప్రజలు కూడా పెద్ద ఎత్తున హాజరై ఉపాధి హామీ పనుల ప్రారంభాన్ని స్వాగతించారు. ఈ పనుల ద్వారా గ్రామంలో అభివృద్ధి మరింత వేగం పుంజుకుంటుందని, కార్మిక కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఘనంగా శివాయిగూడెంలో విగ్నేశ్వరి ఓణీల అలంకరణ వేడుక... ఆశీస్సులు అందించిన డాడీ స్నేహితులు



**రఘునాథపాలెం, జూన్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** శివాయిగూడెం గ్రామంలో చిన్నారి విగ్నేశ్వరి ఓణీల అలంకరణ వేడుక బుధవారం కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో అత్యంత వైభవంగా జరిగింది. బాలబోయిన వెంకన్నలక్ష్మి దంపతుల కుమారుడు ఉపేందర్, పద్మ దంపతుల కుమార్తె విగ్నేశ్వరి జీవితంలో ప్రత్యేక ఘట్టమైన ఈ వేడుక ఆనందోత్సాహాల నడుమ నిర్వహించారు.ఈ సందర్భంగా ఉపేందర్ ఆత్మీయ స్నేహితులు సురేష్, భార్గవ్, నరేష్, రవి, వెంకటేష్, రాజా, రాజు తదితరులు ప్రత్యేకంగా హాజరై చిన్నారి విగ్నేశ్వరికి అక్షింతలు వేసి ఆశీర్వదించారు. చిన్నారి విద్య, విజ్ఞాన రంగాల్లో రాణిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, కుటుంబానికి, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.వేడుకలో పాల్గొన్న బంధువులు, స్నేహితులు విగ్నేశ్వరికి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆమె భవిష్యత్తు సుఖసంతోషాలతో, విజయాలతో నిండిపోవాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమం ఆత్మీయత, ఆనందభరిత వాతావరణంలో ఘనంగా సాగి అందరినీ ఆకట్టుకుంది.

# సామాజిక భద్రత పెన్షన్ దారులకు నేటితో గడువు పూర్తి



**కల్లూరు, జూన్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మున్సిపాలిటీ పరిధిలో సామాజిక భద్రతా పెన్షన్లు పొందుతున్న లబ్ధిదారులు ఫేస్ లైవ్ ఆథెంటికేషన్ పూర్తి చేసుకోవడానికి నేడు ఆఖరి రోజు అని మున్సిపల్ మేనేజర్ నందిసెట్టి నాగేశ్వరావు తెలియజేశారు.పెన్షన్ పొందుతున్న ప్రతి లబ్ధిదారుడు తమకు సమీపంలో ఉన్న బిల్ కలెక్టర్, మెప్మా ఆర్‌పి ద్వారా గాని లేదా కల్లూరు మున్సిపాలిటీ కార్యాలయం నందు గాని ఫేస్ లైవ్ ఆథెంటికేషన్ తప్పనిసరిగా పూర్తి చేసుకోవలసిందిగా కోరారు.ఒకవేళ వృద్ధాప్యం, అనారోగ్యం లేదా ఇతర కారణాల వల్ల ఇంటి నుండి బయటకు రాలేని పరిస్థితిలో ఉన్న పెన్షన్ లబ్ధిదారుల వివరాలను మున్సిపాలిటీ సిబ్బందికి లేదా సంబంధిత బిల్ కలెక్టర్‌కు తెలియజేసినట్లయితే, మున్సిపాలిటీ సిబ్బంది వారి నివాసానికి వెళ్లి ఫేస్ లైవ్ ఆథెంటికేషన్ ప్రక్రియను పూర్తి చేయడం జరుగుతుంది అని అన్నారు. పెన్షన్ లబ్ధిదారులందరూ ఈ విషయాన్ని అత్యవసరంగా గమనించి, నిర్ణీత గడువులోగా ఫేస్ లైవ్ ఆథెంటికేషన్ పూర్తి చేసుకొని తమ పెన్షన్ సేవలను నిరంతరాయంగా పొందవలసిందిగా విజ్ఞప్తి చేయడమైనది.

# జర్నలిస్టు కుమారునికి చికిత్స కోసం ఆర్థిక సహాయం

**● చేయూత అందించిన టి.జె.ఎఫ్ జర్నలిస్ట్ యూనియన్**



**ఖమ్మం, ప్రతినిధి జూన్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** వి ఫైవ్ కోఆర్డినేటర్, ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో ఇన్చార్జ్ కే. వెంకటేశ్వర్లు ( కే. వి) కుమారునికి శస్త్ర చికిత్స కోసం తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీజేఎఫ్) జిల్లా కమిటీ చేయూత అందించింది. కే. వి. కుమారునికి తీవ్ర అనారోగ్య సమస్య తలెత్తి వెన్నుముక్కకు హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స పొందుతున్న సమాచారం తెలుసుకున్న టీజేఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవి లు బుధవారం ఖమ్మంలో జర్నలిస్టు కెవికి 10 వేల రూపాయల ఆర్థిక సహాయం చేశారు. ఈసందర్భంగా వారు స్పందిస్తూ.. టీయూడబ్ల్యూజే (టి జే ఎఫ్) జిల్లా కమిటీ బాధిత జర్నలిస్టు కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కష్టకాలంలో ఉన్న జర్నలిస్టులకు ఆర్థిక సహకారాన్ని ఇప్పటికే అనేకమందికి తమ యూనియన్ పక్షాన సహాయ సహకారాలు అందించి ఆదుకోవడం జరిగిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మందుల ఉపేందర్, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, కోశాధికారి బిక్కి గోపి, నాయకులు కళ్యాణ్, జక్కుల వెంకటరమణ, సుధాకర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టు పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తూ సర్క్యులర్ జారీ

**● సర్క్యులర్లు జారీ పట్ల జిల్లా విద్యాశాఖ.. ఇంటర్ విద్యాశాఖ అధికారులకు జర్నలిస్టుల కృతజ్ఞతలు**



**ఖమ్మం, ప్రతినిధి జూన్10 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఖమ్మం జిల్లాలో జర్నలిస్టు పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థలలో 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైన్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి కే. రవిబాబు లు సర్క్యులర్ ను జారీ చేశారు. జర్నలిస్టు పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థలలో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని కోరుతూ తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీజేఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవి, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు లతో కూడిన జర్నలిస్టు బృందం ఈనెల ఐదవ తేదీన జిల్లా విద్యాశాఖ, ఇంటర్మీడియట్ జిల్లా విద్యాశాఖ అధికారులకు వినతిపత్రాలు సమర్పించిన విషయం తెలిసిందే.. టిజేఎఫ్ జర్నలిస్ట్ యూనియన్ బృందం చేసిన విజ్ఞప్తి మేరకు డి ఈ ఓ, డిఐఈ ఓ జిల్లా అధికారులు స్పందించి బుధవారం జర్నలిస్టు ప్రతినిధులకు సర్క్యులర్లను అందజేశారు. టీయూడబ్ల్యూజే ( టి జే ఎఫ్) జిల్లా కమిటీ జర్నలిస్టుల బృందం విజ్ఞప్తి మేరకు విద్యాశాఖ అధికారులు సర్క్యులర్లు జారీ చేయటం పట్ల జర్నలిస్టు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ మెట్రో ఈవినింగ్ ఎస్ .వెంకటేశ్వర రెడ్డి, ఉపాధ్యక్షులు రేపాక యాదగిరి, ఉల్లోజు రమేష్ , పానకాలరావు,కమిటీ సభ్యులు ఇసంపల్లి వెంకటేశ్వర్లు, బి. అప్పారావు, రోజా, పెంటి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

# నిజాయితీ ఇంకా బతికే ఉంది

**● 50 తులాల వెండి బ్యాగు యజమానికి అప్పగించిన ఆర్టీసీ కండక్టర్**

**● నిజాయితీకి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన మారేశ్వరరావు**

**● సత్తుపల్లి డిపో సిబ్బందిని అభినందించిన ప్రయాణికుడు**




**కల్లూరు, జూన్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రయాణికుడు బస్సులో మరిచిపోయిన 50 తులాల వెండి ఉన్న బ్యాగును తిరిగి అప్పగించి సత్తుపల్లి డిపో కండక్టర్ నల్లగట్ల మారేశ్వరరావు (E-826983) తన నిజాయితీని చాటుకున్నారు.సత్తుపల్లి డిపోకు చెందిన TS 04 UD 1107 బస్సు సత్తుపల్లి నుంచి ఖమ్మం వెళ్తుండగా, ప్రయాణికుడు కొండేటి అజయ్ కుమార్ తన వద్ద ఉన్న బ్యాగును బస్సులోనే మరిచిపోయి ఖమ్మం కొత్త బస్టాండ్‌లో దిగిపోయాడు. అనంతరం బ్యాగు కనిపించకపోవడంతో ఖమ్మం కంట్రోల్ పాయింట్‌లో విధులు నిర్వహిస్తున్న సత్తుపల్లి డిపో సిబ్బంది వేణును సంప్రదించాడు.వెంటనే సమాచారం అందుకున్న కండక్టర్ మారేశ్వరరావు తన వద్ద బ్యాగు భద్రంగా ఉన్నట్లు అజయ్ కుమార్‌కు తెలియజేశారు. అనంతరం అజయ్ కుమార్ తల్లి రమాదేవి సత్తుపల్లి డిపోకు చేరుకుని సంబంధిత ఆధారాలను చూపించడంతో, సెక్యూరిటీ కానిస్టేబుల్ సలీం, చార్ట్ కంట్రోలర్ చిన్నపరెడ్డి సమక్షంలో బ్యాగును ఆమెకు అప్పగించారు. బ్యాగులో ఉన్న 50 తులాల వెండి నగలతో సహా మొత్తం సొత్తు యథాతథంగా తిరిగి దక్కడం పట్ల అజయ్ కుమార్ ఆనందం వ్యక్తం చేశారు. బ్యాగు తిరిగి దొరుకుతుందని తాను ఆశించలేదని పేర్కొంటూ, నిజాయితీగా వ్యవహరించిన కండక్టర్ మారేశ్వరరావుకు, డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణకు, ఆర్టీసీ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కండక్టర్ మారేశ్వరరావు ప్రదర్శించిన నిజాయితీపై ప్రయాణికులు, సహోద్యోగులు ప్రశంసలు కురిపిస్తున్నారు. నిజాయితీ ఇంకా బతికే ఉంది అని పలువురు అభినందించారు.

# ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నాం

**- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సహా సంక్షేమ పథకాలు అమలు**

**- మున్నేరు వరద సమస్యలకు శాశ్వత పరిష్కారంగా రిటైనింగ్ వాల్ నిర్మాణం**

**- పారిశుద్ధ్యం, పచ్చదనం పెంపుతో ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి కృషి**

**- 3.05 కోట్ల యూఐడీఎఫ్ నిధులతో బీటీ రోడ్డు, సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**







**ఖమ్మం ప్రతినిధి, జూన్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు.బుధవారం ఖమ్మం నగరంలోని ఎఫ్‌సీఐ గోదాం నుంచి బైపాస్ రోడ్డు వరకు రూ.3 కోట్ల 5 లక్షల యూఐడీఎఫ్ నిధులతో చేపట్టిన బీటీ రోడ్డు, సీసీ డ్రెన్ నిర్మాణ పనులకు సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ... మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్, సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డులు, పేద విద్యార్థుల కోసం యంగ్ ఇండియా పాఠశాలల ఏర్పాటు వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.ఇంట్లో కూడా అన్ని పనులను ఒకేసారి చేయలేమని, అదే విధంగా ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. గుడిసెల్లో నివసిస్తున్న పేదలకు కొత్త ఇళ్ల మంజూరుకు తాను ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానన్నారు.గతంలో మూడు రోజులకోసారి తాగునీరు సరఫరా జరిగేదని, ప్రస్తుతం ప్రతిరోజూ తాగునీరు అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మున్నేరు వరదల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు చేపట్టామని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో ఉన్న సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించి పనులను పూర్తి చేస్తామని పేర్కొన్నారు.డివిజన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను స్థానిక ప్రజాప్రతినిధులు పర్యవేక్షించాలని, రోడ్లు, డ్రెయిన్ల నాణ్యతపై దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచకపోతే ప్రజల ఆదాయం ఆసుపత్రులకే వెచ్చించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మొక్కలు నాటేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. హైదరాబాద్ తరహాలో ఖమ్మం నగరం లోనూ వేగంగా అభివృద్ధి జరుగుతోందని, రోడ్ల విస్తరణ, జాతీయ రహదారుల నిర్మాణంతో వ్యాపార అవకాశాలు పెరుగుతున్నాయని మంత్రి తెలిపారు.సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. ఖమ్మం నగర అభివృద్ధిపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అన్నారు. మున్నేరు వరదల నేపథ్యంలో రూ.600 కోట్లతో రిటైనింగ్ వాల్ ప్రాజెక్టుకు మంత్రి కృషి చేశారని, పనుల పురోగతిని స్వయంగా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. వెలుగుమట్ల అర్బన్ పార్కును హైదరాబాద్ కేబీఆర్ పార్కు తరహాలో అభివృద్ధి చేస్తున్నారని, ప్రజలు సాయంత్రం వేళల్లో ఆహ్లాదకరంగా గడిపే కేంద్రంగా తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. ఖమ్మం ఖిల్లా రోప్‌వే ప్రాజెక్టు అభివృద్ధి పనులు కూడా కొనసాగుతున్నా యని తెలిపారు. నగర సుందరీకరణ, పచ్చదనం పెంపుపై మంత్రి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని పేర్కొన్నారు.ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ.. మంత్రి ఆదేశాల మేరకు ప్రతి డివిజన్‌లో మెరుగైన రోడ్లు, డ్రెయిన్లు, ఇతర మౌళిక సదుపాయాల కల్పనతో పాటు పారిశుద్ధ్యం, పచ్చదనం పెంపునకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రజా పాలనలో గత రెండున్నర సంవత్సరాలుగా మహిళా సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో పాటు స్వయం సహాయక సంఘాలకు ఆర్టీసీ బస్సులను అద్దె ప్రాతిపదికన అందించి ఆదాయ వనరులు కల్పిస్తున్నామని తెలిపారు. వర్షాకాలంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి డివిజన్‌లో మొక్కలు నాటేందుకు అనువైన ప్రదేశాలను గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, ఆర్డీవో శ్రీనివాస్, సంబంధిత జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# 99 రోజుల పాలనలో అభివృద్ధి ఎక్కడ....?

**● గ్రామసభలో అధికారులను, అధికార పార్టీ నేతలను నిలదీసిన ● ప్రజాపాలన పేరుతో ప్రచారం...! సమస్యల పరిష్కారం శూన్యం అంటూ ఆగ్రహం ● 18 వార్డ్ కౌన్సిలర్ పెడకంటి రామకృష్ణ**






**కల్లూరు, జూన్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా కల్లూరులో బుధవారం నిర్వహించిన గ్రామసభ రాజకీయ విమర్శలు, ప్రోటోకాల్ వివాదాలు, ప్రజా సమస్యల ప్రస్తావనతో వేడెక్కింది. సభలో 18వ వార్డు కౌన్సిలర్, న్యూ ప్రతాప్ ల్యాబ్ అధినేత, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ప్రధాన అనుచరుడు పెడకంటి రామకృష్ణ అధికారుల తీరుపై, అధికార పార్టీ నాయకుల వ్యవహారశైలిపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రశ్నల వర్షం కురిపించారు.99 రోజుల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు కనిపించే అభివృద్ధి ఏమిటి...? ప్రభుత్వం సాధించిన ఘనత ఏమిటో ప్రజలకు చెప్పాలి అంటూ రామకృష్ణ సూటిగా ప్రశ్నించారు. ప్రజాపాలన పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమాలు ప్రజా సమస్యల పరిష్కారానికి కాకుండా కేవలం ప్రచార కార్యక్రమాలుగా మారిపోయాయని ఆరోపించారు.గ్రామసభలో మరో కీలక అంశంగా ప్రోటోకాల్ వివాదాన్ని ప్రస్తావించిన ఆయన, ఖమ్మం జిల్లాకు చెందిన రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథి రెడ్డి, ఎమ్మెల్సీ తాత మధు వంటి ప్రజాప్రతినిధుల ఫోటోలను అధికారిక ఫ్లెక్సీలలో ఎందుకు ప్రదర్శించడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులందరికీ సమాన గౌరవం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు.ఇది ప్రభుత్వ గ్రామసభా...? లేక కాంగ్రెస్ పార్టీ సభా..?" అని ప్రశ్నించిన రామకృష్ణ, కార్యక్రమ నిర్వహణలో రాజకీయ రంగు స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ వేదికలను పార్టీ ప్రచారానికి వాడుకోవడం సరికాదనిఅన్నారు. ప్రజల పన్నుల డబ్బుతో జరిగే కార్యక్రమాలు అన్ని వర్గాలకు చెందిన ప్రజల కోసం ఉండాలని పేర్కొన్నారు.

**18వ వార్డు సమస్యలపై మండిపాటు**

కేవలం విమర్శలకే పరిమితం కాకుండా తన వార్డులో నెలకొన్న సమస్యలను కూడా సభ దృష్టికి తీసుకొచ్చారు. మధిర రోడ్డులోని మద్యం దుకాణాల వద్ద మిషన్ భగీరథ నీరు నిరంతరం వృథాగా పోతున్నా ఇప్పటివరకు ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రుపట్ల రోడ్డులోని బొమ్మరిల్లు వీధిలో వర్షం పడితే బురద, మురుగు నీటితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రెండు నెలల క్రితమే మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో తాగునీటి ట్యాంకు లీకేజీ కారణంగా నీరు నిల్వ ఉండి, టేకు ఆకులు కుళ్లిపోవడంతో దుర్వాసన వ్యాపిస్తోందని, కోతుల బెడదతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ అంశాలను పలుమార్లు ప్రస్తావించినా అధికారులు స్పందించలేదని ఆరోపించారు.

**ఆదాయం మా వార్డు నుంచి అభివృద్ధి మాత్రం కనిపించదు**


మున్సిపాలిటీలోని 20 వార్డులలో 18వ వార్డుకు వచ్చే ఆదాయం మరే వార్డుకు రాదని, అయినప్పటికీ అభివృద్ధి పనులకు సరైన నిధులు కేటాయించడం లేదని రామకృష్ణ మండిపడ్డారు. ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేయకుండా పనులు చేయాలని చెప్పడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు.

**ప్రజలు వస్తున్నారు... వినేవారు లేరు**

గ్రామసభల నిర్వహణ తీరుపై కూడా ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సమస్యలు చెప్పుకోవడానికి ప్రజలు సభలకు వస్తున్నా, వాటిని నమోదు చేసి పరిష్కరించే బాధ్యత గల అధికారులు, సంబంధిత విభాగాల ప్రతినిధులు అందుబాటులో లేక ప్రజలు దిక్కుతోచని స్థితిలో వెనుదిరుగుతున్నారని ఆరోపించారు.సమస్యల పరిష్కారం లేకుండా కేవలం ఫోటోలు, పత్రికా ప్రకటనల కోసం గ్రామసభలు నిర్వహించడం వల్ల ప్రయోజనం ఏమిటి..? అంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు.కౌన్సిలర్ చేసిన ఘాటు వ్యాఖ్యలు అధికారుల పనితీరుపై చేసిన విమర్శలు సభలో చర్చనీయాంశంగా మారాయి. అయితే ఆయన ఆరోపణలపై అధికారులు గానీ, అధికార పార్టీ నాయకులు గానీ వెంటనే స్పందించకపోవడం గమనార్హం. ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వ వైఖరి ఏమిటన్న ప్రశ్నలు ఈ గ్రామసభతో మరింత బలంగా వినిపించాయి.

# స్ఫూర్తి ఫౌండేషన్ నూతన కార్యవర్గం ఎంపిక

**కల్లూరు, జూన్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు పట్టణంలో పేద విద్యార్థులు విద్యలో రాణించేలా పేద విద్యార్థులకు అందిస్తున్న ఉపకార వేతనాలు యథావిధిగా కొనసాగేలా స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ ఉయ్యూరి శ్రీ వ్యాల్ నూతన కార్యవర్గం ను ఎంపిక చేశారు. ప్రతినిధులుగా ఉబ్బన బాబురావు, జల్ది రామకృష్ణ, కొత్తపల్లి వెంకటేశ్వర్లు (నెంబర్ వెంకట్), ఎస్.కె ముజీబ్, చింతలపూడి కృష్ణ ల తో పాటుగా, సహాయకులుగా ఉబ్బన వేణుబాబు, మర్రెల వెంకటేశ్వరరావు, ఇందూరి దేవేందర్ లను నియమించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన ప్రతినిధులు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి, ప్రతినిధులుగా నియమించినందుకు సంస్థ ఫౌండేషన్ చైర్మన్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఫౌండేషన్ చైర్మన్ ఆదేశాల ప్రకారం నిస్వార్థంగా తామంతా కలిసి పేద పిల్లల కోసం అన్ని విధాలుగా సహాయ సహకారం అందిస్తూ ముందుకు సాగుతాని ప్రతిజ్ఞ చేశారు.



# అర్హులైన వారందరినీ ఓటరు జాబితాలో చేర్చాలి

**- అర్హుడైన ఓటరు ఓటు హక్కు కోల్పోకూడదు**

**- మ్యాపింగ్ పూర్తయిన ప్రతి ఓటరు తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారం సమర్పించాలి**

**- ప్రతి రాజకీయ పార్టీ బూత్ స్థాయిలో బీఎల్ఏలను నియమించి ఎస్ఐఆర్ కార్యక్రమానికి సహకరించాలి**

**- అనామలీ ఓటర్ల సమస్యలను పూర్తి ప్రక్రియ ద్వారా పరిష్కరించాలి**

**- ఎస్ఐఆర్ కార్యక్రమంపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**ఖమ్మం ప్రతినిధి, జూన్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్) :** అర్హులైన ప్రతి ఓటరు డ్రాఫ్ట్ జాబితాలో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ... జిల్లాలో సుమారు 12 లక్షల మంది ఓటర్లు ఉండగా, ఇప్పటివరకు 10 లక్షల మంది వరకు ఓటర్ల మ్యాపింగ్ పూర్తయిందన్నారు. వివిధ కారణాల వల్ల మిగిలిన 20 శాతం ఓటర్ల మ్యాపింగ్ జరగలేదని తెలిపారు. ఎస్. ఐ. ఆర్. కార్యక్రమాన్ని అన్ని రాజకీయ పార్టీలు అత్యంత బాధ్యతగా తీసుకోవాలని, బీఎల్వోలు ఇంటింటికి వచ్చినప్పుడు ఓటర్లు సకాలంలో స్పందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో ఒక్క అర్హుడైన ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకూడదనేదే జిల్లా యంత్రాంగం లక్ష్యమని స్పష్టం చేశారు. మ్యాపింగ్ పూర్తయిన ప్రతి ఓటరు కూడా తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారం సమర్పించాలని, ఫారం సమర్పించని పక్షంలో వారి పేరు డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో ఉండదని స్పష్టం చేశారు. అనంతరం అభ్యంతరాలు నమోదు చేయాల్సిన పరిస్థితి ఏర్పడి సమస్యలు తలెత్తుతాయని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు డ్రాఫ్ట్ జాబితాలో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో అనామలీలను గణనీయంగా తగ్గించగలిగామని, గతంలో 30 శాతం ఉన్న అనామలీలను ప్రస్తుతం 20 శాతానికి తగ్గించామని తెలిపారు. 80 శాతం మ్యాపింగ్ పూర్తయిన ఓటర్లలో సిస్టమ్ ద్వారా గుర్తించిన అనామలీలకు నోటీసులు జారీ చేసి పరిశీలన చేపడతామని చెప్పారు. తండ్రి–కొడుకు సంబంధంగా మ్యాపింగ్ చేసిన ఇద్దరి మధ్య వయస్సు వ్యత్యాసం 15 సంవత్సరాల కంటే తక్కువగా ఉన్నా, తాత–మనవడు సంబంధంగా నమోదు చేసిన వారి మధ్య తక్కువ వ్యత్యాసం ఉన్నా వాటిని అనామలీలుగా పరిగణించి నోటీసులు జారీ అవుతాయని తెలిపారు. అనామలీల సమస్య పరిష్కారానికి పూర్తి ప్రక్రియను అనుసరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఓటరు జాబితాలో గుర్తించిన లోపాలు గల ప్రతి అనామలీ ఓటరుకు నోటీసులు జారీ చేసి, వారి వివరణలు స్వీకరించి సవరణలు చేపట్టాల్సి ఉంటుందని చెప్పారు. మొత్తం ప్రక్రియను ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ ఆధారాలతో భద్రపరుస్తామని తెలిపారు. అనామలీలుగా గుర్తించిన ఓటర్ల వద్ద సంబంధిత పత్రాలు ఉన్నాయా లేదా అనే విషయాన్ని నిర్ధారించేందుకు జూలై



15 వరకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) ఈ కార్యక్రమానికి సహకరించాలని కోరారు. ప్రతి రాజకీయ పార్టీ బూత్ స్థాయిలో బీఎల్ఏలను నియమించి కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని సూచించారు. పాత ఎస్ఎస్ఆర్ జాబితాలో ఉండి మ్యాపింగ్ కాని ఓటర్లు ఎన్నికల సంఘం గుర్తించిన 11 గుర్తింపు పత్రాల్లో ఏదో ఒకటి సమర్పించాలని, రేషన్ కార్డును గుర్తింపు పత్రంగా పరిగణించబోమని స్పష్టం చేశారు. మ్యాపింగ్ కాని ఓటర్ల ప్రస్తుత స్థితి, గ్రామంలోనే నివసిస్తున్నారా, జీవించి ఉన్నారా లేదా, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారా వంటి వివరాలను సేకరిస్తామని తెలిపారు. జనన తేదీలను కూడా పరిశీలిస్తామని చెప్పారు. జూలై 1, 1987కు ముందు భారతదేశంలో జన్మించిన వారు తమ స్వీయ గుర్తింపు లేదా జనన పత్రాలు సమర్పిస్తే సరిపోతుందని, తల్లిదండ్రుల పత్రాలు అవసరం లేదన్నారు. జూలై 1, 1987 నుంచి డిసెంబర్ 2, 2004 మధ్య జన్మించిన వారు తమ పత్రాలతో పాటు తల్లి లేదా తండ్రిలో ఎవరి అయినా ఒకరి జనన లేదా గుర్తింపు పత్రం సమర్పించాలని తెలిపారు. డిసెంబర్ 2, 2004 తర్వాత జన్మించిన వారు తమ పత్రాలతో పాటు తల్లిదండ్రులిద్దరి పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని వివరించారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు సేకరిస్తారని తెలిపారు. మ్యాపింగ్ కాని ఓటర్ల నుంచి ఫారాలతో పాటుగుర్తింపు పత్రాలు కూడా సేకరిస్తారని, అనామలీ ఓటర్ల సమస్యలను అవసరమైన పత్రాల ఆధారంగా పరిష్కరిస్తామని చెప్పారు. జూలై 31, 2026న డ్రాఫ్ట్ ఎస్ఐఆర్ ఓటరు జాబితా విడుదల చేస్తామని తెలిపారు. ప్రతి ఓటరు తమ పేరు డ్రాఫ్ట్ జాబితాలో ఉందో లేదో పరిశీలించాలని సూచించారు. ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, ఫిర్యాదులు, కొత్త క్లెయిమ్‌లు స్వీకరిస్తామని చెప్పారు. సెప్టెంబర్ 28 నాటికి అన్ని అభ్యంతరాలు, క్లెయిమ్‌లను పరిష్కరించి అక్టోబర్ 1, 2026న తుది ఎస్ఐఆర్ ఓటరు జాబితాను విడుదల చేస్తామని తెలిపారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్వోలు ఇంటింటికి వచ్చినప్పుడు ఓటర్లు పూర్తి వివరాలతో ఎన్యూమరేషన్ ఫారాన్ని సమర్పించి తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి సంబంధించిన బీఎల్వో వివరాలను ప్రజలకు తెలిసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఆర్డీఓ శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధులు బెల్లం వేణుగోపాల్, రమేష్, పి. నాగరాజు, బీజేపీ ప్రతినిధులు రాజేష్, వెంకటేశ్వర్ రావు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు గోపాలరావు, సత్యనారాయణ, సిపిఎం డి. తిరుపతి, ఎన్. వీరబాబు, ఆప్ ప్రతినిధి పి. శ్రీనివాస్, టీడీపీ పాలడుగు టిఆర్ కృష్ణప్రసాద్, బిఎస్పి సిహెచ్ నాగేశ్వర రావు, ఎం. నాగేశ్వరరావు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

---

# ప్రభుత్వ విద్యకు ప్రాధాన్యత ఇవ్వండి

**ప్రాథమిక విద్యకు కాదు**

**ఉన్నత విద్యకు ఖర్చు చేయండి**

**పాఠశాల మౌలిక వసతులకు సహకరిస్తా**

**నాణ్యమైన ప్రభుత్వ విద్యను**

**సద్వినియోగం చేసుకుందాం**

**బడిబాట కార్యక్రమంలో భాగస్వామ్యమైన**

**గ్రామ సర్పంచ్ పోట్రు శ్రీనివాసరావు**




**కల్లూరు, జూన్ 9 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మండల విద్యాశాఖ అధికారి పత్తిపాటి నివేదిత ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం పాల్గొని ప్రభుత్వ విద్యాభివృద్ధికి, ప్రభుత్వ విద్య ప్రాముఖ్యతను వివరిస్తూ మంగళవారం మండల పరిధిలోని యర్రబోయినపల్లి గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పోట్రు శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రభుత్వ పాఠశాలలో చేరండి. పాఠశాల మౌలిక వసతులకు సహకరిస్తానని విద్యాశాఖ అధికారి సమక్షంలో పిల్లల తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. అంతేకాకుండా పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ పిల్లల చదువుకు సందర్భాన్ని బట్టి ఖర్చు చేయాల్సిన అవసరం ఉందని కానీ ప్రాథమిక విద్యకు కాకుండా ఉన్నత, సాంకేతిక విద్యకు ఖర్చు చేస్తే పిల్లల భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉన్నత చదువులు చదివిన ఉపాధ్యాయులు ఉంటారని అందువల్ల నాణ్యమైన విద్యను అందించగలరని ప్రజలు అర్థం చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాఠశాలలో ఏదైనా మౌలిక వసతులు అవసరముంటే తన వంతు సహకారం అందించి పిల్లలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకుంటానని అన్నారు. ఈ క్రమంలో పిల్లల విద్యకు ఎటువంటి అడ్డంకులు ఎదురవ్వకుండా చూసుకోవలసిన బాధ్యత ఉపాధ్యాయులని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకునే మనము ప్రభుత్వ పాఠశాలను విస్మరించటం సరైనది కాదని అన్నారు. గ్రామంలో అందరూ సహకరిస్తేనే ఏ వ్యవస్థ అయినా సక్రమంగా కొనసాగుతుందని ప్రజలు తమ సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్వాడీలు, గ్రామస్తులు, పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

---

# 6వ డివిజన్‌లో నూతన ఓపెన్ జిమ్‌ను ప్రారంభించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్..








**కరీంనగర్ జిల్లా జూన్ 10(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరంలోని 6వ డివిజన్ బొమ్మకల్ లో మలయప్ప ఫౌండేషన్ సీఎస్ఆర్ నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ఈరోజు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ "ఫిట్ ఇండియా" నినాదం స్ఫూర్తితో ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు, ఆరోగ్యకర జీవనశైలిని ప్రోత్సహించేందుకు ఈ ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో, మలయప్ప ఫౌండేషన్ సీఎస్ఆర్ నిధుల ద్వారా ఈ సౌకర్యం అందుబాటులోకి రావడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఈ ఓపెన్ జిమ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని, యువతతో పాటు అన్ని వయస్సుల వారు దీనిని సద్వినియోగం చేసుకోవాలని మేయర్ సూచించారు. ఈ కార్యక్రమంలో 6వ డివిజన్ కార్పొరేటర్ మేకల వెంకటేష్, మున్సిపల్ సిబ్బంది, వాకర్స్, డివిజన్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

---

# మల్లంపల్లి మండల అభివృద్ధికి మౌలిక సదుపాయాలు కల్పించాలి

**• ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు వేగవంతం చేయాలని మండల సాధన సమితి డిమాండ్**



**మల్లంపల్లి, జూన్ 10 (పీ.సీ.డబ్ల్యూ న్యూస్):** మల్లంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో మండల సాధన సమితి నాయకులు పాల్గొని, మండల అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలను ప్రస్తావిస్తూ పంచాయతీ పాలకవర్గానికి వినతిపత్రాన్ని అందజేశారు. నూతనంగా ఏర్పడిన మల్లంపల్లి మండలంలో ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు అందుబాటులోకి రావాలంటే ప్రభుత్వ కార్యాలయాలను త్వరితగతిన ఏర్పాటు చేయాలని వారు కోరారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రి, 108 అంబులెన్స్ సేవలు, పోలీస్ స్టేషన్, బస్టాండ్, గ్రంథాలయం మరియు ఇతర ముఖ్య ప్రభుత్వ కార్యాలయాలను ప్రజల అవసరాలకు అనుగుణంగా విశాలమైన, అనువైన స్థలాల్లో నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మల్లంపల్లి గ్రామ సర్పంచ్ ల్యాద శ్యామరావు, పంచాయతీ కార్యదర్శి మరియు పాలకవర్గ సభ్యులు సానుకూలంగా స్పందించారు. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మండల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని మండల సాధన సమితి నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల సాధన సమితి నాయకులు గోల్కొండ రాజు, మేరుగు రాజు, ఒన్నాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

---

# కల్లూరులో ప్రైవేట్ బస్సు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు



**కల్లూరు, జూన్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** కల్లూరు పట్టణములోని మధిర బ్రాంచ్ ఎన్ఎస్పీ కాలువ బ్రిడ్జిపై బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. ద్విచక్ర వాహనాన్ని ప్రైవేట్ బస్సు ఢీకొనడంతో ఏడుకొండలు, కోటమ్మలకు గాయాలయ్యాయి. వెంటనే వారిని అంబులెన్స్ ద్వారా కల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన ఏడుకొండలు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, కోటమ్మ కల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. సమాచారం అందుకున్న కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చంద్రరావు, కౌన్సిలర్ ఉబ్బన రాంబాబు తదితరులు బాధితులను పరామర్శించారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే రాగమయికి ఫోన్ ద్వారా ప్రమాద వివరాలు తెలియజేసి, బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు.



---

# పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత: మేయర్ కొలగాని శ్రీనివాస్




**కరీంనగర్ జిల్లా జూన్ 10(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని తీగలగుట్టపల్లి 2వ డివిజన్‌లో పర్యావరణ పరిరక్షణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, మై భారత్ జిల్లా యువజన అధికారి జి. తిరుపతి రెడ్డి కలిసి పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన అవగాహన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. తెలంగాణ గాంధీ స్మారక నిధి, హైదరాబాద్, నేషనల్ యూత్ ప్రాజెక్ట్ , నిఫా సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రస్తుతం మానవ జీవనం ప్రకృతికి విరుద్ధంగా సాగుతోందని, చెట్ల నరికివేత, అడవుల అంతరించిపోవడం వల్ల భూతాపం పెరిగి తీవ్రమైన ఎండలు, వేడి కారణంగా జీవరాశులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రస్తుతం పర్యావరణ పరిరక్షణపై శ్రద్ధ చూపకపోతే భవిష్యత్తులో ఆక్సిజన్ కోసం కూడా డబ్బు చెల్లించాల్సిన పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. యువత సామాజిక బాధ్యతగా ముందుకు వచ్చి ప్రజల్లో పర్యావరణ చైతన్యాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు. అనంతరం మేయర్ ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మై భారత్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రవీందర్, ఎన్వైపీ రాష్ట్ర అధ్యక్షుడు కె. యాదవరాజు, జి. రాజశేఖర్, గొల్లె తిరుపతి, యువ నాయకుడు గాండ్ల నరేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలకు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన హెచ్ఏఎఫ్‌ను రద్దు చేయండి

## వన్ హాస్పిటల్ ఎండి మర్రి మహేష్ రెడ్డిపై చర్యలు తీసుకోండి

## జిల్లా పోలీస్ కమిషనర్‌కు ఎంఐఎం నేత అన్నేమల్ల సురేష్ విజ్ఞప్తి



**కరీంనగర్ టౌన్ జూన్ 10(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ పట్టణంలో నిబంధనలకు వ్యతిరేకంగా ఏర్పాటుచేసిన సంఘ వ్యతిరేక సంస్థ అయిన హెచ్ ఏ ఎఫ్ హాస్పిటల్ యాక్షన్ ఫోర్స్ను తక్షణమే రద్దుపరిచి ఈసంస్థను స్థాపించిన వ్యవస్థాపకుడు మర్రి మహేశ్ రెడ్డితో పాటు మరికొందరిపై చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త ఎంఐఎం నేత అన్నేమల్ల సురేష్ జిల్లా పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం కు లిఖితపూర్వకంగా బుధవారం ఫిర్యాదు చేశారు. ఇటీవల కాలంలో కరీంనగర్ లో వన్ హాస్పిటల్ నిర్వహిస్తున్న ఎండి, మర్రి మహేష్ రెడ్డి హాస్పిటల్ యాక్షన్ ఫోర్స్ హెచ్ ఏ ఎఫ్ అనే పేరుతో నిబంధనలకు వ్యతిరేకంగా ఒక కృత్రిమ సంఘాన్ని ఏర్పాటు చేసి, వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రులకు వచ్చేటువంటి పేద వర్గాలను, దళితులను, ముస్లింలను టార్గెట్ చేసి వీరికి వీరికి వైద్యం చేయాలంటే ఇదే ఆసుపత్రిలో పనిచేస్తున్న ఒకరు బాధ్యత తీసుకోవాలని బాధ్యత తీసుకున్న వ్యక్తి ఆసుపత్రుల యాజమాన్యాలు ఎంత చెబితే అంత ముక్కు పిండి డబ్బులు పేద దళిత ముస్లిం వర్గాల నుంచి బలవంతంగా డబ్బులు కట్టించుకోవడానికి ఏర్పాటు చేయబడినటువంటి కృత్రిమ సంస్థ హెచ్ ఏ ఎఫ్. హెచ్ ఏ ఎఫ్ అనే నిబంధనలకు వ్యతిరేకంగా స్థాపించబడినటువంటి సంస్థ బహుశా చరిత్రలో ఇదే మొదటిసారి ఈ సంస్థకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్కు ఎలాంటి సంబంధం లేదని ఇటీవలే ఇండియన్ మెడికల్ అసోసియేషన్ బాధ్యులు పత్రిక ముఖంగా ప్రకటించడం జరిగింది. గత కొద్ది రోజులుగా వన్ హాస్పిటల్ లో జరుగుతున్న అనేకమైన రోగుల మరణాలు, తదనంతరం జరిగిన పరిణామాలను దృష్టిలో పెట్టుకొని సమాజంలో ఉండబడే పేదలు ముస్లింలు దళితులు బడుగు బలహీన వర్గాల నుంచి బలవంతంగా డబ్బులు కట్టించుకోవడానికి హాస్పిటల్ యాక్షన్ ఫోర్స్ అనే పేరుతో కొత్త రకం మోసానికి తెరలేపడం జరిగింది. ఈ హాస్పిటల్ యాజమాన్యంపై గతంలోనూ పోలీస్ కేసులు నమోదు కావడం జరిగింది. నిబంధనలకు వ్యతిరేకంగా ఏర్పాటు చేయబడ్డటువంటి సంఘ వ్యతిరేక హెచ్ ఏ ఎఫ్ హాస్పిటల్ యాక్షన్ ఫోర్స్ ను రద్దుచేసి, ఈ సంఘ వ్యతిరేక సంఘాన్ని స్థాపించిన వ్యవస్థాపకుడైన వన్ హాస్పిటల్ ఎండి మర్రి మహేష్ రెడ్డి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తమరిని కోరుతున్నాము. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా జాగ్రత్తలు చేపట్టాలని తమరికి విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపెల్లి సత్యనారాయణ జన్మదిన వేడుకలు..



**కరీంనగర్ టౌన్ జూన్ 10(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ బస్టాండ్ చౌరస్తాలో మానకొండూరు శాసన సభ్యులు మరియు రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపెల్లి సత్యనారాయణ జన్మదిన వేడుకలను కరీంనగర్ జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంజన్ కుమార్ మరియు కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆల్ ఫోర్స్ నరేందర్ రెడ్డి కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, డాక్టర్ కవ్వంపెల్లి సత్యనారాయణ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులను అధిష్టించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ మాట్లాడుతూ, జెడ్పీటీసీ స్థాయి నుండి ఎమ్మెల్యేగా ఎదిగిన డాక్టర్ కవ్వంపెల్లి రాజకీయ ప్రస్థానాన్ని గుర్తు చేశారు. యువజన కాంగ్రెస్‌కు అండగా ఉంటూ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఆయన సారథ్యంలో గతంలో చేపట్టిన అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలు మరియు పోరాటాలను కొనియాడారు. ఎస్సీ సెల్ బలోపేతానికి, కొత్త నాయకత్వాన్ని తయారు చేయడంలో ఆయన చూపుతున్న చొరవను ప్రశంసించారు. పాల్గొన్న నాయకులు: ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గంట కళ్యాణి శ్రీనివాస్ మహిళా నగర అధ్యక్షురాలు వెన్నం రజిత యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి శ్యామ్ సుందర్, కరీంనగర్ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కిమ్ ఫాహద్, గుర్రం వాసు, మహమ్మద్ ఇమ్రాన్, వసీం, మహేష్, ఇమ్రాన్ ఘని, శ్రీకాంత్, కరీంనగర్ అసెంబ్లీ ఉపాధ్యక్షులు అఖిలేష్ గౌడ్, బండి శరణ్య,ఆశీష్ రెడ్డి, మనోహర్, కుమార్ మరియు ఇతర కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇది మామూలు సన్మానం కాదు

## - గుర్తుర్ హెచ్ఎం తిరుమలేశును సన్మానించిన డీఈఓ మరియు ఎంఈఓ.

## - హెచ్ఎంను అభినందించిన గ్రామ సర్పంచ్ వి .కవిత బాలకృష్ణ.







**తొర్రూరు ప్రతినిధి ,జూన్ 10(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రతి చెమట చుక్క వెనక దాగి ఉన్నది ఆయన కృషి ఆ కృషితోనే తయారు చేశారు ఒక ప్రత్యేకమైన శాలువను దానితోనే సన్మానించారు గుర్తుర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి తిరుమలేశును మహబూబాబాద్ జిల్లా విద్యాధికారి సత్యనారాయణ, తో పాటు తోర్రూర్ మండల విద్యాధికారి ఎం బుచ్చయ్య బడిబాట కార్యక్రమాన్ని పురస్కరించుకొని బుధవారం పాఠశాల ప్రాంగణంలోని గ్రామ సర్పంచ్ వి కవితా బాలకృష్ణ తోటి ఉపాధ్యాయులు గ్రామస్తుల సమక్షంలో వారిని ఘనంగా సన్మానించారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా తోటి ఉపాధ్యాయులతో కలిసి వీధులన్నీ తిరుగుతూ గడప గడపను వదిలి వేయకుండా ప్రతి ఒక్కరిని పలకరిస్తూ ఇది ప్రభుత్వ పాఠశాల ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నేడు ఉపాధ్యాయులు ఉన్నారని అన్ని రకాల వసతులను పాఠశాలలో కల్పించడం జరుగుతుందని ప్రతి ఒక్కరికి తెలియపరుస్తూ గ్రామస్తుల సమక్షంలో విద్యార్థుల విద్యార్థులను బడిలో చేర్పించుకున్నారు. ఇది ఆ పాఠశాలలో సమిష్టి కృషితో సాధించుకున్న ఘనత మండలంలోని గుర్తుర్ పాఠశాల కి దక్కటం ఎంతో గర్వకారణం అని గ్రామ సర్పంచ్ కవితా బాలకృష్ణ అభినందించారు. ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా డీఈవో మరి ఎంఈఓ బడిబాట కార్యక్రమాన్ని సందర్శించి విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తుల సమక్షంలో వారు ప్రసంగించారు గతంలో పాఠశాలలో ఎన్రోల్మెంట్ 88 మంది విద్యార్థులు ఉన్నారు ఈ సంవత్సరం పాఠశాల డైరెక్టర్ ఇచ్చిన టార్గెట్ ను పూర్తిచేసి అదనంగా విద్యార్థులను చేర్పించినందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులను మరియు ఉపాధ్యాయులను వారు అభినందించారు. ప్రభుత్వ పాఠశాల కన్నా ప్రైవేట్ పాఠశాల మిన్న అంటూ గ్రామ సర్పంచ్ కవితా బాలకృష్ణ వారి ఇరువురు మనమరాలను ప్రాథమిక పాఠశాల లో డీఈఓ , ఎంఈఓ సమక్షంలో పాఠశాలలో చేర్పించారు గ్రామ సర్పంచ్ ను విద్యాధికారులు ప్రత్యేక అభినందనలు తెలిపారు ఇదే పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు గౌతమి ఇరువురు పిల్లల ఇక్కడే చదివిస్తున్నందుకు వారికి కూడా ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని డిఈఓ ప్రసంగిస్తూ ప్రభుత్వ పాఠశాలలో ఉన్నత విద్యావంతులైన ఉపాధ్యాయులు ఉన్నారని నాణ్యమైన విద్య అందుబాటులో ఉంటుందని అన్నారు ఈ సంవత్సరం నుండి గుర్తుర్ పాఠశాలకు ఫ్రీ ప్రైమరీ స్కూల్ మంజూరు అయ్యిందని మూడు సంవత్సరాల పిల్లలను కూడా పాఠశాలలో చేర్చవచ్చని అన్నారు ఈ సంవత్సరం నుండి అల్పాహారం కూడా విద్యార్థిని విద్యార్థులకు అందించడం జరుగుతుందని తెలిపారు.

# దుబాయ్ ప్రమాద బాధితుల కుటుంబాలకు అండగా ఎమ్మెల్యే సత్యం

● గల్ఫ్ కార్మికుల మృతదేహాల కోసం దుబాయ్ వెళ్లిన చొప్పదండి ఎమ్మెల్యే



**చొప్పదండి జూన్ 10(పిసిడబ్ల్యూ న్యూస్):** దుబాయ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చొప్పదండి నియోజకవర్గం, జగిత్యాల వాసుల మృతదేహాలను స్వదేశానికి తరలించేందుకు చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డిసిసి అధ్యక్షులు డా.మేడిపల్లి సత్యం దుబాయ్ కు పయనమయ్యారు.దుబాయ్‌లోని ఎమిరేట్స్ రోడ్డుపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో జగిత్యాల జిల్లాకు చెందిన ముగ్గురు వలస కార్మికులు మృతి చెందడం పట్ల చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.**ప్రమాద వివరాలు:**దుబాయ్‌లో లారీ ఆగి ఉండగా, వెనుక నుంచి వచ్చిన మినీ బస్సు ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మొత్తం ఐదుగురు మృతి చెందగా, వారిలో ముగ్గురు తెలంగాణ ప్రవాసులు ఉన్నారు.**మృతి చెందిన జగిత్యాల జిల్లా, చొప్పదండి నియోజకవర్గ వాసులు:**1. సయ్యద్ సలీం (51) నమికొండ గ్రామం, కొడిమ్యాల మండలం2. గొల్లపల్లి తిరుపతి గౌడ్ (42) తక్కల్లపల్లి గ్రామం, మల్యాల మండలం 3. అబ్బుల్ రఫీక్ (37) గాజులపేట, మెట్‌పల్లి మండల కేంద్రంకు చెందిన వారు ఉన్నారు వీరితో పాటు చొప్పదండి నియోజకవర్గానికి చెందిన గాయ పడ్డ క్షతగాత్రులను స్వదేశానికి తీసుకువచ్చేందుకు ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు.**ఎమ్మెల్యే చొరవ:**మృతుల కుటుంబాల విజ్ఞప్తి మేరకు, మృతదేహాలను స్వదేశానికి తరలించేందుకు ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం స్వయంగా దుబాయ్ బయలుదేరినారు. ఇప్పటికే భారతీయ కాన్సులేట్ అధికారులతో మాట్లాడి మృతదేహాల తరలింపు ప్రక్రియను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. విదేశాల్లో కష్టపడుతున్న తెలంగాణ బిడ్డలకు ఏ ఆపద వచ్చినా ప్రభుత్వం అండగా ఉంటుందని, మృతుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు.



# నిశ్శబ్ద ప్రపంచంలో 'యశోద' వెలుగులు

## 8 ఏళ్ల బాలికకు వినికిడి పునరుద్ధరణ!

## మలక్‌పేట్ యశోద ఆసుపత్రి వైద్యుల అద్భుత ఘనత..

## అత్యాధునిక శస్త్రచికిత్సతో చిన్నారికి నూతన జీవితం!




**ఖమ్మం ప్రతినిధి, జూన్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఆ చిన్నారి ప్రపంచం ఎనిమిదేళ్లుగా నిశ్శబ్దంగానే సాగింది. తోటి పిల్లల నవ్వులు, అమ్మ పిలుపులు, ప్రకృతి పలకరింపులు ఆమెకు స్పష్టంగా చేరలేదు. కానీ, వైద్యో నారాయణో హరిః అన్న సూక్తిని నిజం చేస్తూ, హైదరాబాద్ మలక్‌పేట్ యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు ఆ చిన్నారి జీవితంలో సరికొత్త కాంతులు నింపారు. పుట్టుకతోనే వినికిడి లోపంతో బాధపడుతున్న కల్వకుర్తికి చెందిన 8 ఏళ్ల బాలికకు అత్యంత అధునాతనమైన 'బోన్ కన్డక్షన్ హియరింగ్ ఇంప్లాంట్ (ఓసియా 300)' శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి, ఆమెకు శబ్దాల ప్రపంచాన్ని బహుమతిగా ఇచ్చారు. బుధవారం ఖమ్మం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రముఖ ఈ.ఎన్.టి సర్జన్ డాక్టర్ రవికుమార్ ఈ సర్జరీకి సంబంధించిన మానవీయ, సాంకేతిక వివరాలను వెల్లడించారు. **మాతృత్వపు లాలనలా.. 'మైక్రోటియా' శాపాన్ని చెరిపేసిన వైద్యం!**

ఈ సందర్భంగా డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ.. సదరు బాలిక 'రైట్ మైక్రోటియా విత్ హియరింగ్ లాస్' (కుడి చెవి బాహ్య రూపం సరిగ్గా పెరగకపోవడం, వినికిడి లోపించడం) అనే సమస్యతో బాధపడుతూ ఆసుపత్రిలో చేరినట్లు తెలిపారు. పిల్లల్లో ఇలాంటి లోపాలు ఉన్నప్పుడు సరైన సమయంలో స్పందించకపోతే వారి మాటల అభివృద్ధి, కమ్యూనికేషన్ నైపుణ్యాలు దెబ్బతిని, వారి సామాజిక, విద్యా జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 'మైక్రోటియా మరియు కన్డక్టివ్ హియరింగ్ లాస్ ఉన్న పిల్లల్లో ఓసియా వంటి బోన్ కన్డక్షన్ ఇంప్లాంట్లు అత్యంత సమర్థవంతమైన పరిష్కారం. ముందస్తు జోక్యం ద్వారా వినికిడి మెరుగుపడటంతో పాటు, మాటలు, భాషా అభివృద్ధికి ఇది కీలకంగా సహాయపడుతుందని ఈ.ఎన్.టి సర్జన్ డాక్టర్ రవికుమార్ అన్నారు. చిన్నారి వయస్సును దృష్టిలో ఉంచుకుని జనరల్ అనస్థీషియా (సాధారణ మత్తు) కింద ఎటువంటి అంతర్గత సమస్యలు లేకుండా ఈ క్లిష్టమైన శస్త్రచికిత్సను వైద్య బృందం విజయవంతంగా పూర్తి చేసింది. ఆపరేషన్ అనంతరం కూడా చిన్నారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఐవి ఫ్లూయిడ్స్, యాంటీబయాటిక్స్, మరియు నొప్పి నివారణ మందులతో సమగ్ర పర్యవేక్షణ అందించారు. ప్రస్తుతం చిన్నారి పూర్తి ఆరోగ్యంతో, స్థిరమైన స్థితిలో డిశ్చార్జ్ అయ్యిందని వైద్యులు ఆనందం వ్యక్తం చేశారు. అత్యున్నత ప్రమాణాలు కలిగిన ఆపరేషన్ థియేటర్లు, అత్యాధునిక నిర్ధారణ సదుపాయాలు, అనుభవజ్ఞులైన వైద్య నిపుణుల సమిష్టి సమన్వయమే ఈ విజయానికి కారణమని యశోద ఆసుపత్రి వైద్యులు స్పష్టం చేశారు. చిన్నారి వినికిడి లోపాన్ని దూరం చేసి, ఆమె భవిష్యత్తును బంగారు మయం చేయడమే లక్ష్యంగా మలక్‌పేట్ యశోద ఆసుపత్రి నిరంతరం శ్రమిస్తోందని, ఈ విజయం ఆసుపత్రి యొక్క అంకితభావానికి మరో నిదర్శనమని సగర్వంగా ప్రకటించారు. ఈ విలేకరుల సమావేశంలో వాసు కిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డా. కవ్వంపల్లి సత్యనారాయణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మెహమ్మద్ తాజోద్దీన్..



**కరీంనగర్ టౌన్ జూన్ 10(పిసిడబ్ల్యూ న్యూస్):** మానకొండూర్ శాసనసభ్యులు, తెలంగాణ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ జన్మదిన సందర్భంగా జిల్లా కాంగ్రెస్ మైనారిటీ డిపార్ట్మెంట్ చైర్మన్ మెహమ్మద్ తాజోద్దీన్ మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మెహమ్మద్ తాజోద్దీన్ మాట్లాడుతూ, డా. కవ్వంపల్లి సత్యనారాయణ ప్రజాసేవకు అంకితభావంతో పనిచేస్తూ నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రజలకు మరింత సేవ చేసేలా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొని ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో ప్రత్యేక వార్డు సభ






**కరీంనగర్ టౌన్ జూన్ 10(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈరోజు నిర్వహించిన ప్రత్యేక వార్డు సభ కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. కరీంనగర్‌లోని రెవెన్యూ గార్డెన్‌లో నిర్వహించిన వార్డు సభలో స్థానిక ప్రజల సమస్యలు, అభివృద్ధి అవసరాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై చర్చించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని సుడా చైర్మన్ హామీ ఇచ్చారు.అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటి, ప్రతి ఒక్కరూ చెట్ల పెంపకానికి బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో వార్డు సభలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శివసాయి నగర్‌లో డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలి





**సత్తుపల్లి, జూన్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్)** :సత్తుపల్లి పట్టణంలోని 5 వార్డు శివసాయి నగర్ కాలనీ గత కొన్ని ఏళ్లుగా మౌలిక వసతుల అభివృద్ధికి నోచుకోకుండా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బానోత్ విజయ్ పట్టణ ప్రధాన కార్యదర్శి మంద శివ ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో నెలకొన్న సమస్యలను పరిశీలించిన వారు స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కాలనీలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు ఎక్కడపడితే అక్కడ నిల్వ ఉంటోందని కాలనీవాసులు వాపోయారు. ముఖ్యంగా వర్షాలు కురిసిన సమయంలో పరిస్థితి మరింత దారుణంగా మారి, వర్షపు నీరు మొత్తం కాలనీలోనే నిలిచిపోతుందని తెలిపారు. సమస్యను చూసేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు వస్తున్నప్పటికీ శాశ్వత పరిష్కారం చూపించే ప్రయత్నం మాత్రం ఎవరూ చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిల్వ నీటి కారణంగా కాలనీలో విపరీతంగా దోమలు పెరిగి, దుర్వాసన వెదజల్లుతోందని, దీంతో ప్రజలు అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని చెప్పారు. చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.శివసాయి నగర్‌లో డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా మెరుగుపరిచి, మురుగునీటిని గాడిదల వాగులో కలిసేలా శాశ్వత ప్రణాళిక రూపొందించాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.కాలనీవాసుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. శివసాయి నగర్ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

## విద్యుత్ చౌర్యంపై ఫంక్షన్ హాల్‌పై విజిలెన్స్ కేసు

**నడికూడ, జూన్ 10(పిసిడబ్ల్యూ న్యూస్):** నడికూడ మండలం వరికోల్ గ్రామంలో నిర్మించిన మండలంలోని వరికోల్ గ్రామంలో రామలింగేశ్వర ఫంక్షన్ హల్ పై విజిలెన్స్ అధికారులు తనికీలు చేపట్టి విద్యుత్ చౌర్యం కేసు నమోదు చేసినట్టు తెలుస్తుంది..ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి రూ 3 కోట్ల ప్రభుత్వం నిధులతో గ్రామంలో న రామలింగేశ్వర ఫంక్షన్ హాల్ నిర్మించారు. ఫంక్షన్ హాల్ లో విద్యుత్ చౌర్యానికి పాల్పడుతోందన్న సమాచారం మేరకు బుధవారం విద్యుత్ శాఖకు చెందిన విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేసి,కేసు నమోదైనట్లు తెలుస్తుంది.

## రెడ్ క్రాస్ సొసైటీ మంచిర్యాల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు

**- అదాని గ్రూప్ ఓరియంట్ సిమెంట్ మరియు రెడీక్రాస్ సొసైటీ మంచిర్యాల వారి ఆధ్వర్యంలో మెగా రక్త దాన శిభిరం ఏర్పాటు.**

**- ఈ కార్యక్రమం దేవాపూర్‌లోని లేడీస్‌క్లబ్‌లో నిర్వహించడం జరిగింది**





**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 10(పీసీడబ్ల్యూ న్యూస్):** మంచిర్యాల జిల్లా, కాసిపేట మండలంలోని దేవాపూర్ అదానీ గ్రూప్ ఓరియంట్ సిమెంట్ మరియు రెడ్ క్రాస్ సొసైటీ మంచిర్యాల్ వారి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం బుధవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని దేవాపూర్ లోని లేడీస్ క్లబ్ లో నిర్వహించారు. శిబిరంలో మొత్తం 400 మంది రక్తదానం ఇచ్చేందుకు పాల్గొన్నారు. సమాజం పట్ల వారి ఔదార్యాన్ని తెలియజేశారు. రక్తదాతల అందరికీ సొసైటీ మంచిర్యాల భాస్కర్ రెడ్డి తో పాటు ఓరియల్ సిమెంట్ అదానీ గ్రూపుకు సంబంధించిన రక్తదానం చేసిన దాతలు అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని యూనిటీ హెడ్ ప్రసంగిస్తూ రక్తదానం అనేది ఎంతో విశిష్టమైన కార్యక్రమం ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం జరుగుతుందని తోటి వారికి సహాయం చేసినట్లుగా ఉంటుందని కూడా దీనితోపాటు రక్తదానం అని పిలవగానే 400 మంది రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఒక్కొక్కసారి అత్యవసరం అనుకున్న రక్తం దొరకక ఎంతోమంది ఇబ్బందుల పాలవుతున్న సందర్భాలు కూడా లేకపోలేదని వారు గుర్తు చేశారు. రక్తమిచ్చినవారు వారికి మళ్ళీ రక్తం కావాలనుకుంటే రెడ్ క్రాస్ సొసైటీ ఇచ్చిన సర్టిఫికెట్లు ఆధారంగా వారికి కూడా అత్యవసరం అనుకున్నప్పుడు రక్తాన్ని అందించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో యూనిటీ హెడ్అఖిల్ కుమార్ అగర్వాల్, నరేంద్ర జాన్వి హెచ్ఆర్ హెడ్, కారకూరీ తిరుపతి, మంచిర్యాల రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి శరత్ కుమార్ నిర్వహించిన కమిటీ సభ్యులు, దేవాపూర్ గ్రామ సర్పంచ్ సిడెం రామదాసు, దేవాపూర్ ఆస్పత్రి వైద్య బృందం, రెడ్ క్రాస్ సొసైటీ వైద్య బృందం తో పాటు పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సేవే పరమావధిగా.. మధుసూదన్ రెడ్డి జన్మదిన వేడుకలు!

**బీసీ సెల్ అధ్యక్షుడు రామరాజు యాకన్న**

**సమాజ సేవే జన్మదినానికి సార్థకత: డాక్టర్ జంగాల సునీల్ కుమార్**



**ఖమ్మం ప్రతినిధి, జూన్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్) :** నిజమైన పుట్టినరోజు వేడుక అంటే ఆడంబరాలకు పోవడం కాదు, తోటివారి కష్టాల్లో తోడు నిలవడం.. బాధితుల పెదవులపై చిరునవ్వులు పూయించడం. సరిగ్గా ఇదే మానవీయ కోణాన్ని చాటిచెప్పారు కోహెడ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి జన్మదిన వేడుకల నిర్వాహకులు బీసీ సెల్ అధ్యక్షుడు రామరాజు యాకన్న. మధుసూదన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం నాడు ఖమ్మం నగరంలోని స్థానిక సాయిరాం గ్యాస్ట్రో హాస్పిటల్‌లో రోగులకు పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీసీ సెల్ అధ్యక్షుడు రామరాజు యాకన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ సేవా కార్యక్రమం హాస్పిటల్‌లోని రోగుల గుండెలను హత్తుకుంది. **సమాజ సేవే జన్మదినానికి సార్థకత: డాక్టర్ జంగాల సునీల్ కుమార్** జన్మదిన మహోన్నత కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సాయిరాం గ్యాస్ట్రో హాస్పిటల్ ప్రముఖ వైద్యులు డాక్టర్ జంగాల సునీల్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ, సమాజ సేవే నిజమైన జన్మదిన వేడుకలకు అసలైన అర్థమని కొనియాడారు. 'చిలుక మధుసూదన్ రెడ్డి" భవిష్యత్తులో ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించి ప్రజలకు నిరంతర సేవలు అందించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నానన్నారు. రోగుల బాధలను పంచుకుంటూ, వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపేలా ఈ కార్యక్రమాన్ని తలపెట్టిన రామరాజు యాకన్న మానవతా దృక్పథాన్ని డాక్టర్ సునీల్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. చిలుక మధుసూదన్ రెడ్డి జన్మదిన వేడుకలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది భాగస్వామ్యం అభినందనీయం అన్నారు. ఈ సేవా కార్యక్రమంలో కేవలం నిర్వాహకులే కాకుండా, ఆసుపత్రిలోని వైద్యులు, నర్సింగ్ సిబ్బంది కూడా స్వచ్ఛందంగా భాగస్వాములు కావడం విశేషం. తెల్లని దుస్తుల్లో సేవామూర్తులుగా నిలిచే నర్సులు, రోగులకు పండ్లను పంపిణీ చేస్తూ వారిలో భరోసా నింపిన తీరు అక్కడి వారిని ఎంతగానో కదిలించింది. ఈ కార్యక్రమం కేవలం ఒక వేడుకలా కాకుండా, తోటి సమాజం పట్ల బాధ్యతను గుర్తుచేసే ఒక ఆదర్శనీయ ఘట్టంగా నిలిచింది. ఈ సేవా యజ్ఞంలో ఆసుపత్రి సిబ్బందితో పాటు సరస్వతి, శ్రీవాణి, దివ్య, అమల, మౌనిక, సుమ, అశ్విని, పరమేశ్వరి తదితరులు పాల్గొని, రోగులకు సేవలు అందిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కమలాపూర్‌లో లైసెన్స్ లేని డ్రైవర్లతో పాఠశాల వాహనాలు విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమా?

**పిసిడబ్ల్యూ న్యూస్ ప్రత్యేక ప్రతినిధి:**




హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలో కొన్ని ప్రైవేటు పాఠశాలలకు చెందిన వాహనాలు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయనే ఆరోపణలు స్థానిక ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా విద్యార్థులను రవాణా చేసే స్కూల్ బస్సులు, వ్యాన్లను సరైన డ్రైవింగ్ లైసెన్స్ లేని వ్యక్తులతో నడిపిస్తున్నారని పలువురు తల్లిదండ్రులు, ప్రజా సంఘాల ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన పాఠశాల యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.ప్రతిరోజూ వందలాది మంది చిన్నారులు ఈ వాహనాల్లో పాఠశాలలకు వెళ్లి వస్తుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో డ్రైవర్‌కు సరైన అర్హతలు లేకపోవడం, చెల్లుబాటు అయ్యే లైసెన్స్ లేకపోవడం ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో స్కూల్ బస్సుల ప్రమాదాల వల్ల విద్యార్థులు గాయపడిన సంఘటనలు చోటుచేసుకున్న నేపథ్యంలో కమలాపూర్‌లోనూ ఇలాంటి నిర్లక్ష్యం కొనసాగడం ఆందోళనకరంగా మారింది.మోటారు వాహనాల చట్టం ప్రకారం విద్యార్థులను రవాణా చేసే వాహనాలను నడిపే డ్రైవర్లకు సంబంధిత వర్గానికి చెందిన చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్, అనుభవం, అలాగే అవసరమైన శిక్షణ ఉండాలి. అదేవిధంగా వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికేట్, ఇన్సూరెన్స్, కాలుష్య నియంత్రణ ధ్రువీకరణ పత్రాలు, స్పీడ్ వంటి భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా ఉండాలి. అయితే కొన్ని ప్రైవేటు పాఠశాలలు ఈ నిబంధనలను పూర్తిగా పాటించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.కొన్ని ప్రాంతాల్లో స్కూల్ వాహనాలు అతివేగంగా నడుస్తున్నాయని, సామర్థ్యానికి మించి విద్యార్థులను ఎక్కించుకుంటున్నాయని కూడా ఫిర్యాదులు వస్తున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ రోడ్లపై ఈ వాహనాలు ప్రయాణిస్తున్న సమయంలో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదానికి కారణమవుతుందని ప్రజలు హెచ్చరిస్తున్నారు. విద్యార్థుల ప్రాణాలకు సంబంధించిన అంశంలో రాజీ పడకూడదని వారు స్పష్టం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో జిల్లా రవాణా శాఖ అధికారులు, పోలీసు శాఖ, విద్యాశాఖ సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. కమలాపూర్ లోని అన్ని ప్రైవేటు పాఠశాలల వాహనాలపై సమగ్ర తనిఖీలు చేపట్టి డ్రైవర్ల లైసెన్స్‌లు, వాహనాల పత్రాలు, భద్రతా ప్రమాణాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన పాఠశాల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు భారీ జరిమానాలు విధించాలని డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థుల భద్రత విషయంలో ప్రభుత్వం, అధికారులు ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా తక్షణ చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందస్తు చర్యలతో ప్రమాదాలను నివారించడం ఎంతో మంచిదని వారు అభిప్రాయపడుతున్నారు. చిన్నారుల ప్రాణాలు అమూల్యమైనవి కాబట్టి స్కూల్ వాహనాల నిర్వహణలో అన్ని నిబంధనలను కచ్చితంగా అమలు చేయించి విద్యార్థులకు సురక్షిత ప్రయాణాన్ని కల్పించాల్సిన బాధ్యత సంబంధిత శాఖలపై ఉందని ప్రజలు పేర్కొంటున్నారు.

# 43, 42వ డివిజన్లలో గోదాంగడ్డలో ఎస్ఐఆర్ పై ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ

**కరీంనగర్ టౌన్ జూన్ 10(పిసిడబ్ల్యూ న్యూస్):** భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఎస్ఐఆర్ ఓటర్ మ్యాపింగ్ ను ప్రతి ఒక్క పౌరుడు విధిగా చేయించుకోవాలని, ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ పిలుపునిచ్చారు. ఎంఐఎం పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు గురువారం నగరంలోని 43, 42వ డివిజన్ పరిధిలో గోదాంగడ్డ, భగత్ నగర్, మోమిన్ పురలో ఎస్ఐఆర్ ప్రక్రియపై ఓటర్ మ్యాపింగ్ చేయించుకోవాల్సిన ఆవశ్యకతపై, ర్యాలీ ద్వారా డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించారు. వర్షం పడుతున్నప్పటికీ కూడా లెక్కచేయకుండా ఎస్ఐఆర్ ప్రక్రియపై ఓటర్ మ్యాపింగ్ పై ప్రజలకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ నేటి నుండి రాబోయే జూన్ 24వరకు ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియపై ఎస్ఐఆర్ ఆవశ్యకతపై నగరంలోని దాదాపు అన్ని డివిజన్లలో డోర్ టు డోర్ అవగాహన కార్యక్రమాలను, ర్యాలీ ద్వారా, పాదయాత్రల ద్వారా నిర్వహిస్తామని వెల్లడించారు. దీంతోపాటు కరీంనగర్ దారుస్సలామ్ లో ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియపై ఉదయం 10గంటల నుండి రాత్రి 9గంటల వరకు హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. కుల, మతాలకతీతంగా ప్రజలందరూ ఎస్ఐఆర్ ఓటర్ మ్యాపింగ్ ను చేయించుకోవాలని కోరారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే కరీంనగర్ ఎంఐఎం కార్యాలయం దారుస్సలాంలో సలహాలు, సూచనలు, సహాయాన్ని అందించడానికి ఎంఐఎం పార్టీ వాలంటీర్లు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో పాటు భూపాలపల్లి జిల్లాకు ఎస్ఐఆర్ కార్యక్రమ ఎంఐఎం పార్టీ ప్రతినిధిగా పెద్ద గురుతరమైనటువంటి బాధ్యతతో తనను నియమించిన ఎంఐఎం పార్టీ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీకి గులాం అహ్మద్ కృతజ్ఞతలు తెలిపారు. నగరంలో పూర్తిస్థాయిలో ప్రతి ఒక్క పౌరుడిని ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియలో పాల్గొనే విధంగా విస్తృతంగా ఎంఐఎం పార్టీ ద్వారా తమ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు ప్రచారం నిర్వహించి తీరుతామన్నారు. ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియలో పాల్గొని ఓటు మ్యాపింగ్ చేయించుకోకుంటే ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని, ఒకవేళ ఓటు హక్కు కోల్పోతే భారత పౌరసత్వం రద్దుఅవ్వడంతో పాటు, బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్ అవుతాయని, తమ తమ పేర్లపై ఉన్న ఆస్తులకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు రద్దు అవుతాయని, ప్రభుత్వం వాటిని స్వాధీనం చేసుకునే అవకాశం ఉందన్నారు. జూన్ 14న ఆదివారం రోజున నగరంలోని గోదాం గడ్డ ప్రాంతంలో గల ఎస్బిఎస్ ఫంక్షన్ హాల్ లో సాయంత్రం 5గంటల నుండి రాత్రి 10గంటల వరకు ఎస్ఐఆర్ ఓటర్ మ్యాపింగ్ పై అవగాహన సదస్సు, ట్రైనింగ్ వర్క్ షాప్ ను నిష్ణాతులైన అభ్యర్థులతో సుమారు 1000మంది బిఎల్ఎ-2 వాలంటీర్లలకు ట్రైనింగ్ వర్క్ షాప్ ప్రోగ్రాం ఎంఐఎం పార్టీ ద్వారా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం కోకార్పొరేటర్ సయ్యద్ ఇబ్రహీం బియబాని, కార్పొరేటర్ మాజిద్ హుస్సేన్, కంటెస్టెడ్ కార్పొరేటర్ అబ్దుల్ గఫ్ఫార్, మాజీ కార్పొరేటర్ లింగపల్లిశ్రీనివాస్, నాయకులు మేరాజ్, , వలి, ఇమ్రాన్, ఇస్మాయిల్, రియాజ్, ఇంతియాజ్, ముబిన్, నదీమ్, యాసర్, ఉమర్, శానవాజ్, సమీర్ డివిజన్ పెద్దలు పాల్గొన్నారు.




# హుస్నాబాద్ అభివృద్ధే లక్ష్యంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ముందడుగు

## విద్య, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమలు, పర్యాటక రంగాల్లో ప్రత్యేక ప్రణాళికలతో దూసుకుపోతున్న నియోజకవర్గం

**హుస్నాబాద్, జూన్ 10(పిసిడబ్ల్యూ న్యూస్):** హుస్నాబాద్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి మరియు స్థానిక ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ కృషి చేస్తున్నారని టీపీసీసీ సభ్యులు బొమ్మనపల్లి అశోక్ రెడ్డి పేర్కొన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమలు, పర్యాటకం, ఉపాధి కల్పన వంటి అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధికి మంత్రి ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారని తెలిపారు.మెట్ట ప్రాంతమైన హుస్నాబాద్ రైతాంగానికి గౌరవెల్లి రిజర్వాయర్ ద్వారా లక్ష ఎకరాలకు పైగా సాగునీరు అందించేందుకు రూ.437 కోట్లతో కాలువల నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. అక్కన్నపేట మండలంలో 80 ఎకరాల విస్తీర్ణంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటూ వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కార్యాచరణ రూపొందించారని చెప్పారు.విద్యా రంగ అభివృద్ధిలో భాగంగా శాతవాహన యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ కళాశాల మంజూరు చేయించి రూ.44 కోట్ల నిధులు సాధించారని, ఈ విద్యా సంవత్సరంలోనే కళాశాల ప్రారంభం కానుందని తెలిపారు. కోహెడ మండలం తంగళ్లపల్లి గ్రామంలో రూ.180 కోట్లతో గురుకుల ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలకు శంకుస్థాపన చేయడం కూడా నియోజకవర్గానికి గొప్ప వరమని పేర్కొన్నారు.వైద్య సేవల విస్తరణ కోసం హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని 250 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తూ రూ.82 కోట్ల నిధులు మంజూరు చేయించారని తెలిపారు. అలాగే సెట్విన్ శిక్షణా కేంద్రం ద్వారా యువతకు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాల కోసం ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు అమలు చేస్తున్నారని చెప్పారు.వ్యవసాయ ఆధునీకరణ, పశుసంపద అభివృద్ధి, రైతుల ఆర్థిక స్థిరత్వం కోసం ప్రత్యేక చర్యలు చేపడుతూ సబ్సిడీ రుణాలు, వ్యవసాయ పరికరాల పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. మహిళా సాధికారతకు



ప్రాధాన్యతనిస్తూ మహిళా సంఘాల ద్వారా రుణాలు, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని వివరించారు.నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగ ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు పలు కంపెనీల ప్రతినిధులతో జాబ్ మేళాలు నిర్వహించడం విశేషమన్నారు. పర్యాటక రంగ అభివృద్ధిలో భాగంగా తెలంగాణ తొలి గ్లాస్ బ్రిడ్జి నిర్మాణానికి మంత్రి చొరవ తీసుకున్నారని, త్వరలో ఇది ప్రజలకు అందుబాటులోకి రానుందని తెలిపారు.హుస్నాబాద్ పట్టణ సుందరీకరణ, రహదారుల అభివృద్ధి, హుస్నాబాద్కరీంనగర్ నాలుగు లేన్ల రహదారి నిర్మాణం, ఆలయాల అభివృద్ధి, ఎల్కతుర్తి సర్కిల్ అభివృద్ధి, సబ్ కోర్టు, ఎంఆర్ఓ కార్యాలయం, విద్యుత్ సబ్‌స్టేషన్ అప్‌గ్రేడేషన్ వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు మంత్రి కృషితో సాధ్యమయ్యాయని అశోక్ రెడ్డి పేర్కొన్నారు.అలాగే అక్కన్నపేట మండల పరిషత్ కార్యాలయ నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులు మంజూరు చేయించారని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని వెంటనే పరిష్కరించే విధంగా అధికారులతో సమన్వయం చేస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నారని తెలిపారు.రాష్ట్రంలో లోటు బడ్జెట్ పరిస్థితులు ఉన్నప్పటికీ హుస్నాబాద్ నియోజకవర్గానికి భారీ స్థాయిలో నిధులు తీసుకువచ్చి అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ నాయకత్వం ఈ ప్రాంత ప్రజలకు వరమని అన్నారు. ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్న మంత్రికి హుస్నాబాద్ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని బొమ్మనపల్లి అశోక్ రెడ్డి పేర్కొన్నారు.

# 370 రద్దుతో ..నెహ్రూ రికార్డును అధిగమించిన మోడీ !

భారత ప్రజాస్వామ్య చరిత్రలోనే మున్నెన్నడూ చూడని ఒక అరుదైన మైలురాయి ఆవిష్కృతం అయ్యింది. దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ పేరిట ఏడు దశాబ్దాలుగా చెక్కుచెదరకుండా ఉన్న అత్యధిక కాలం ఎన్నికైన ప్రధాని రికార్డును ఈ నెల 10న ప్రధాని నరేంద్ర మోడీ బద్దలు కొట్టారు. ఇక ప్రధానిగా మోడీ సాధించిన విజయాలు అనేకం ఉన్నాయి. ఇవన్నీ కూడా భారతదేశ చరిత్ర గతిని తిప్పేవని చెప్పుకోక తప్పదు. ప్రధానంగా నెహ్రూ 370 ఆర్టికల్ పెట్టి కశ్మీర్‌ను ఇండియాకు దూరం చేస్తే..అదే 370ని రద్దు చేయడం ద్వారా ప్రధాని మోడీ చారిత్రక నిర్ణయం తీసుకుని, కాశ్మీర్‌ను భారత్‌లో సంపూర్ణంగా విలీనం చేశారు. అలాగే కాశ్మీర్ ఇప్పుడు సంపూర్ణంగా విలీనం కావడంతో పాటు, అక్కడ వేర్పాటువాద, ఉగ్రవాద మూకలను క్రూకటి వేళ్లతో పెరివేశారు. మోడీ ధృఢ సంకాల్పనికి...చరిత్రాత్మక నిర్ణయానికి ఇది నిదర్శనంగా చూడాలి. పటేల్ తరహాలో దేశంలో ఐక్యత సాధించే యత్నాలను నేటికీ మోడీ కొనసాగించే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. 2014 మే 26న ప్రమాణ స్వీకారం చేసిన మోడీ.. వరుసగా మూడు సార్లు అధికారంలోకి వచ్చి, సందిగ్ధ రాజకీయ పరిస్థితులను దాటుకుంటూ సగర్వంగా 4,399 రోజులు పూర్తి చేసుకోవడం చిన్న విషయం కాదు. తద్వారా దేశ రాజకీయాల్లో ఒకే ఒక్కడుగా కొత్త చరిత్ర సృష్టించారు. ఈ క్రమంలో భారత రాజకీయాల్లో జూన్ 10, 2026 ఒక సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజుగా నిలిచిపోనుంది. ఆ రోజుతో దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ చరిత్రలోనే అత్యధిక కాలం సేవలు అందించిన నేరుగా ప్రజలు ఎన్నుకున్న ప్రధానిగా సరికొత్త రికార్డు సృష్టించారు. స్వతంత్ర భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న 12 ఏళ్ల 14 రోజుల రికార్డును ప్రధాని మోడీ అధిగమించారు. అంతేగాకుండా అందరికీ దూరంగా,అంటరాని పార్టీగా ఉన్న బిజెపిని ప్రజల్లోకి తీసుకెళ్లిన ఘనత కూడా మోడీదని చెప్పాలి. అందుకు ఆయనకు కుడిభుజంగా పనిచేస్తున్న అమిత్ షా వ్యూహాలను కూడా తక్కువ చేయలేం. ఈ ఇద్దరి జంట దేశంలో భారతీయ జనతాపార్టీ పునాదులను బలోపేతం చేసిందనడంలో సందేహం లేదు. ఇక మోడీ తీసుకున్న నిర్ణయాల్లో మరోటి అయోధ్య సమస్యకు చెక్ పెట్టడం. రావణ కాష్టంలా ఉన్న అయోధ్య సమస్యను సుప్రీం కోర్టు ముందుంచి పరిష్కరించగలగడం చారిత్రాత్మక విజయంగా చూడాలి. కోటానుకోట్ల హిందువుల గుండెల్లో ఇది చిరస్మరణీయ నిర్ణయంగా నిలిచిపోయింది. ట్రిపుల్ తల్లాక్ వంటి అనాగరిక చట్టాలను కూడా రద్దు చేయడం ద్వారా ముస్లిం మహిళలకు అండగా నిలబడ్డారు. ప్రధానంగా ఉమ్మడి పౌరస్మృతి కోసం చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తే.. భారత్‌లో విభజన రాజకీయాలకు చెక్ పడనుంది. అలాగే మహిళా బిల్లును గట్టెక్కించే ప్రయత్నంలో ఓ అడుగు పడింది. అంతేకాకుండా అంతర్జాతీయంగా యోగా దినోత్సవాన్ని జూన్ 21న నిర్వహించేలా ఐక్యరాజ్యసమితి చేసిన తీర్మానం మోడీ ప్రతిభకు నిదర్శనంగా చూడాలి. అలాగే అనేక దేశాల్లో పర్యటించి భారత్ ప్రతిభను చాటడమే గాకుండా ఆయా దేశాలతో సంబంధ బాధంవ్యాలను బలోపేతం చేయడంలో అద్భుత విజయం సాధించారు. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నుకున్న ప్రధానిగా జవహర్‌లాల్ నెహ్రూ దేశంపై తనదైన ముద్ర వేశారు. ఆయన కూడా అనేక సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారు. తొలి ప్రధానిగా నెహ్రూపై దేశ పునర్నిర్మాణ బాధ్యత లు పడ్డాయి. అదే స్వతంత్ర భారతాన్ని పటిష్ఠమైన పునాదులతో పదిలంగా నిర్మించడం.. అంతేకాదు పేదరికంలో మగ్గిపోతున్న, శతాబ్దాల బానిసత్వంతో ఆత్మవిశ్వాసం కోల్పోయిన జాతిని సగర్వంగా తలెత్తుకు నిలిపేలా చేయడం. ఇవి మరే ప్రధానికీ ఎప్పుడూ ఎదురుకాని కఠిన సవాళ్లు అనడంలో సందేహం లేదు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్ని సమర్థంగా నిభాయించిన నెహ్రూ.. దేశంపై చెరిగిపోలేని ముద్ర వేశారు. అందుకు ఆనాటి ఉప ప్రధాని పటేల్ చేదోడువాదోడుగా నిలిచారు. సంస్థానాలను విలీనం చేసి దేశాన్ని ఐక్యంగా నిలబెట్టారు. అంతకుముందు స్వాతంత్రోద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన



నెహ్రూ.. ఆ తర్వాత స్వతంత్ర భారత తొలి ప్రధానిగా.. అటు స్వయంత్ర సమరయోధుల ఆశయ సాధనకు, ఇటు దేశ ప్రజల ఆకాంక్షలకు పెద్దపీట వేస్తూ.. పాలన సాగించారనడంలో సందేహం లేదు. అయితే పదవీకాలం ప్రకారం ఇన్నాళ్లుగా చెక్కుచెదరని చారిత్రక రికార్డు నెహ్రూ పేరిట ఉండగా ప్రధాని మోడీ ఇప్పుడు దానిని అధిగమించారు. ప్రజాస్వామ్య ఎన్నికల్లో నెహ్రూ కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రజాప్రతినిధిగా ఎన్నికై దేశానికి ప్రధాన మంత్రిగా ప్రాతినిథ్యం వహించారు. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత నుంచి ఇప్పటిదాకా 15 మంది ప్రధాన మంత్రులు గా ప్రాతినిథ్యం వహించారు. జాతీయ ప్రజాస్వామ్య కూటమిలో బీజేపీ తరఫున నరేంద్రమోడీ సుదీర్ఘకాలం పనిచేసిన ప్రధానమంత్రిగా అరుదైన రికార్డును కొన్నేళ్ల క్రితమే సొంతం చేసుకున్నారు. ఇప్పుడు నెహ్రూ రికార్డును అధిగమించారు. అలాగే కోట్లాది మంది భారతీయులకు ఆరాధ్యనేతగా ఎదిగారు. ఇది ఆషామాషీ విషయం కాదు. ప్రజల గుండెల్లో స్థానం సంపాదించడం మామూలు విషయం కాదు. ఇది దేశ చరిత్రలోనే ఓ అరుదైన మైలురాయిగా నిలిచిపోనుంది. 2014లో ప్రధానిగా ప్రమాణస్వీకారం చేసిన నరేంద్రమోడీ తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు ఆయనను ప్రజలకు చేరువ చేస్తున్నాయి. 370 రద్దు, ట్రిపుల తలాక్ రద్దు, అయోధ్య, మహిళా బిల్లు వంటివన్నీ మోడీకి జననీరాజనం పట్టేలా చేసినవే. దేశంలో రాష్ట్రప్రభుత్వ అధినేతగా.. దేశాధినేతగా నరేంద్రమోడీది ఎవరికీ సాధ్యంకాని రికార్డు నెలకొల్పారు. గుజరాత్ ముఖ్యమంత్రి గా నరేంద్ర మోడీ దేశానికి రోల్ మోడల్ అయ్యారు. అలాగే ముఖ్యమంత్రి మంత్రి పదవికి రాజీనామా చేసి దేశానికి ప్రధాన మంత్రి అయ్యారు. సమర్థ నాయకత్వం..సుస్థిర పాలనతో భారత రాజకీయాల్లో ఒక చారిత్రాత్మక మైలురాయిని సాధించారు. 25 ఏళ్ల రాజకీయ అనుభవంతో ప్రభుత్వ పాలనలో వివిధ రికార్డుల్ని బ్రేక్ చేశారు. సరికొత్త రికార్డులను నెలకొల్పి సంచలన నిర్ణయాలకు కారకులయ్యారు. సాంకేతికం గా చూస్తే నెహ్రూ మొత్తం ప్రధానిగా ఉన్న కాలం మోడీ కంటే కచ్చితంగా ఎక్కువే. కానీ నెహ్రూ మొదటి సారి 1947లో మధ్యంతర ప్రభుత్వానికి ప్రధానిగా ఉన్నారు తప్ప నేరుగా ప్రజల ద్వారా ఎన్నిక కాలేదు. కానీ, 2014 మే 26న మొదటిసారి నేరుగా ప్రజా బ్యాలెట్ ద్వారా ఎన్నికై ప్రధాని పీఠం అధిరోహించిన నరేంద్ర మోడీ, నాటి నుంచి నేటి వరకు నిరంతరాయంగా ప్రజామోదంతోనే ఈ రికార్డు సొంతం అయ్యింది.